PRABHATA SURYA
ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వెల రూ.5/ - పేజీలు : 8 ఆదివారం 28 సెప్టెంబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news


## చిన్న కార్ల కోసం ఉద్గారాల విడుదలలో నిబంధనలను సడలించే యోచనలో ప్రభుత్వం

చిన్న కార్లకు సంబంధించి ప్రభుత్వం కఠినమైన ఇంధన సామర్థ్య నిబంధనలను తీసుకురా నుంది. ఈ మేరకు నిబంధనల ముసాయిదా విడుదల చేసింది. ప్రస్తుత కార్పొరేట్ సగటు ఇంధన సామర్థ్య నిబంధనల ప్రకారం, అనుమతించదగిన కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాల పరిమాణం వాహన బరువుతో ముడిపడి ఉంది. 3,500 కిలోల కంటే తక్కువ బరువున్న అన్ని ప్రయాణీకుల కార్లకు ఇది వర్తిస్తుంది. దీన్ని 909 కిలోలు అంతకంటే తక్కువ బరువున్న, నాలుగు మీటర్ల కంటే తక్కువ పొడవున్న పెట్రోల్ కార్లకు సవరించేలా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ

# కన్నీటి కరూర్

## తొక్కిసలాటలో 38 మంది దుర్మరణం.. వందమందికి పైగా క్షతగాత్రులు



- తమిళనాడు కరూర్‌లో టీవీకే ప్రచార సభ.. ఉదయం నుంచే జనం పడిగాపులు
- నాలుగు గంటలు ఆలస్యంగా వచ్చిన విజయ్.. ఇరుకు రోడ్డులో కిక్కిరిసిన జనం
- సభ ముగియగానే అదుపుతప్పిన పరిస్థితి.. ఒకరిమీద ఒకరు పడి తొక్కిసలాట
- హుటాహుటిన కరూర్ చేరుకున్న సీఎం స్టాలిన్.. హైకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ

చెన్నై

తమిళనాట పెను విషాదం చోటుచేసుకుంది. ఒక రాజకీయ సభ... మృత్యు వేదికగా మారింది. తమిళ సినీ నటుడు, తమిళ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ శనివారం కరూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మరణ మృదంగం మోగింది. లెక్కకు మిక్కిలిగా జనం తరలివచ్చారు. దారులు మొత్తం కిక్కిరిసిపోయాయి. పరిస్థితి అదుపు తప్పి... తొక్కిసలాటకు దారి తీసింది. అధికార వర్గాలు అందించిన సమాచారం ప్రకారం... ఈ విషాదంలో 38 మంది మరణించారు. వంద మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఏడుగురు పిల్లలు, 17 మంది వరకు మహిళలు ఉన్నారు. 12మంది పరిస్థితి విషమంగా ఉందని... మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని తెలుస్తోంది. తమిళ నటుడు విజయ్ టీవీకే పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్రచారం ప్రారంభించారు. గత మూడు వారాలుగా ప్రతి శని, ఆదివారాల్లో - మిగతా3లో

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై రేపటి నుంచి విచారణ



## 29, 1 తేదీల్లో నలుగురిపై విచారణ
## పండుగ తర్వాత మరో నలుగురిపై..

హైదరాబాద్

బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై విచారణకు ముహూర్తం కుదిరింది. విచారణ తేదీలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఖరారు చేశారు. ఈ మేరకు శనివారం శాసనసభ కార్యదర్శి షెడ్యూల్‌ను విడుదల చేశారు. సెప్టెంబరు 29, అక్టోబరు 1 తేదీల్లో నలుగురు ఎమ్మెల్యేలను విచారిస్తారు. రెండు రోజుల సమయం కాలెయాదయ్య, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్‌లకు కేటాయించారు. మిగతా నలుగురిని దసరా పండుగ తర్వాత - మిగతా2లో

## బీసీ రిజర్వేషన్ల పెంపుపై అంత తొందరెందుకు?

### రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై అంత తొందరెందుకని సర్కార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లు ఆమోదం పొందే వరకు ఆగొచ్చు కదా.. పంచాయతీరాజ్ చట్ట సవరణ చేయకుండా జీఓ జారీ చేస్తే రిజర్వేషన్ల - మిగతా2లో





## మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు!

### రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
### నిర్వహణ వ్యయం రూ.350 కోట్లు
### రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ

హైదరాబాద్

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 దశల్లో.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను 2 దశల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎన్నికల నిర్వహణకు రూ. 350 కోట్ల బడ్జెట్‌ను - మిగతా2లో

# పదేళ్ల పాలకులు.. నమ్మక ద్రోహులు

- అధికారమిస్తే నిరుద్యోగులను నట్టేట ముంచారు
- పదేళ్లలో గ్రూప్-1 నిర్వహించలేని అసమర్థులు
- మేం ప్రకటిస్తే.. కడుపులో విషంతో అడ్డుకునే కుట్ర
- 40 ఏళ్లలో చేయనిది 19 నెలల్లో పూర్తిచేశాం
- గ్రూప్-1 అధికారులుగా బాధ్యతతో ఉండండి
- తెలంగాణ అంటే ఏంటో దేశానికి చూపించండి
- తల్లిదండ్రులను విస్మరిస్తే జీతంలో కోత: సీఎం



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ నేతలు.. ప్రజలకు నమ్మకద్రోహం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. జీవితాలను బాగు చేస్తారని ప్రజలు ఓటేస్తే.. రాష్ట్రాన్ని కొల్లగొట్టారని, కొలువులు ఇస్తారని నిరుద్యోగులు అధికారం కట్టబెడితే.. వారిని నట్టేట ముంచారని ధ్వజమెత్తారు. కొలువులన్నీ కేవలం ఒక్క కుటుంబానికే దక్కాయన్నారు. నియామకాల కోసం సాధించుకున్న రాష్ట్రంలో.. పదేళ్లలో కనీసం ఒక్క గ్రూప్-1 కూడా నిర్వహించలేని అసమర్థత కేసీఆర్ ప్రభుత్వానిదని మండిపడ్డారు. శనివారం శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి.. ఇటీవల గ్రూప్-1 అధికారులుగా ఎంపికైన 562 మందికి సీఎం నియామక - మిగతా2లో



## కాళ్లబేరానికి వచ్చిందనే కనికరించాం!

- 'సిందూర్' కాల్పుల విరమణలో మూడో వ్యక్తి ప్రమేయం లేదు
- భారత దాడుల్లో భారీ నష్టం జరగడంతో పాకిస్తాన్‌కు తత్వం బోధపడింది
- అయినా పాకిస్తాన్‌దే విజయమని షెహబాజ్ షరీఫ్ చెప్పుకుంటున్నారు
- ధ్వంసమైన రన్‌వేలు, కాలిపోయిన హ్యాంగర్లు విజయంగా కనిపిస్తున్నాయా?
- ఉగ్రవాద కేంద్రాలను మూసివేసి, ముష్కరులను అప్పగిస్తేనే పాక్‌తో చర్చలు
- ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో పాక్ వాదనను తిప్పికొట్టిన భారత్

3



## ఇక స్వదేశీ 4జీ!

- స్వదేశీ టెక్నాలజీతో బీఎసఎన్‌ఎల్ సేవలు
- ఒడిశాలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- 37,500 కోట్లతో 97,500 మొబైల్ టవర్లు
- ప్రధాని మోదీ కలలకు ప్రతిరూపమైన డిజిటల్ ఇండియా లక్ష్య సాధనలో ఇదొక మైలురాయి



# భయపెట్టిన మూసీ

- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ గేట్లెత్తటంతో ఉగ్రరూపం....
- నీట మునిగిన పరీవాహక ప్రాంతాలు.. ఎంజీబీఎస్ మూసివేత
- లోలెవెల్ వంతెనలు క్లోజ్.. వాహనాల దారిమళ్లింపు
- వేలమంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష
- శనివారం సాయంత్రానికి తగ్గిన వరద ఉధృతి
- మంజీర ఉగ్రరూపం.. కొట్టుకుపోయిన ఏడుపాయల గుడి ప్రసాదం కౌంటర్

2లో

# మదమంచి నాగసాయి జన్మదిన సందర్భంగా

యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం.....




**మియాపూర్ ప్రభాత సూర్య :** యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోదరుడు మదమంచి నాగసాయి జన్మదినం సందర్భంగా మానవ సేవే మాధవ సేవ స్ఫూర్తితో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ."సేవలోనే ఆనందం అన్నదానంలోనే ఆరాధన" అనే నినాదంతో, ఈ కార్యక్రమాన్ని మియాపూర్ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఎంతో వైభవంగా నిర్వహించి, ఆకలితో ఉన్న వారికి భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ. .అన్నదానం కన్నా గొప్ప దానం మరి ఏమి లేదు. మేము చేపడుతున్న ప్రతి కార్యక్రమం వెనుక సమాజ సేవే ప్రధాన లక్ష్యం. మదమంచి నాగసాయి జన్మదినాన్ని స్మరణీయంగా మార్చడానికి ట్రస్ట్ ద్వారా ఈ అన్నదానాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది అన్ని అన్నారు.ఆకలితో ఉన్నవారికి భోజనం అందించడం నిజమైన పూజ. ఈ సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ యువత ముందుండి, సమాజం కోసం పని చేయాలని నా ఆకాంక్ష. ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని సమాజాన్ని సేవిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చాను. అలాగే, యలమంచి ఉదయ్ కిరణ్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహించే సేవా కార్యక్రమాలు ప్రజల హృదయాలను తాకుతూ, మియాపూర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల మద్దతును పొందుతున్నాయి , రాజకీయ రంగంలో కూడా అందరి మన్ననలు పొందుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరిని అభినందిస్తూ, ఈ కార్యక్రమం గొప్ప పరిణామంగా నిలిచిందని ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాంచందర్ గౌడ్, బాలమురళి, సుబ్బరాయుడు, వీరభద్రరావు, రమణ, సుబ్బారెడ్డి, రాధాకృష్ణ, గోకినేని రమేశ్, మదమంచి వంశీ, దినేశ్ గౌడ్, కార్తిక్, బుచ్చిబాబు, రాహుల్, సతీష్, యలమంచి ప్రవీణ్, మధు, కామినేని వాసు, రమేశ్, బాబు, వీర, నిఖిల్, రాకేష్, జానేశ్వరరావు, శివ తదితరులు, పెద్దలు మరియు యువతీయువకులు ఘనంగా పాల్గొన్నారు.

# బతుకమ్మ పండుగ మహిళా శక్తికి ప్రతీక

-డైరెక్టర్ మల్లంపాటి శ్రీవిద్య






**ఖమ్మం( సూర్య ప్రతినిధి )** ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన సాంప్రదాయ పండుగ బతుకమ్మను కళాశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల డైరెక్టర్ మల్లంపాటి శ్రీవిద్య ప్రిన్సిపాల్ డాక్టర్ జై లక్ష్మీనారాయణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మల్లంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ పండుగ మహిళా శక్తికి ప్రతీక అని పర్యావరణానికి మేలు చేసే పూలతో చేసే ఈ వేడుక ప్రకృతిని కాపాడే ప్రాముఖ్యతను తెలుపుతుంది అన్నారు. రాష్ట్ర ఆడబిడ్డల ఆరాధ్యదేవత అయిన గౌరి దేవిని పూలతో అలంకరించిన బతుకమ్మతో విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో పాటలు పాడుతూ నృత్యాలతో ఉత్సాహంగా పాల్గొనడం మన సంస్కృతి సాంప్రదాయాలకు నిదర్శనంగా ఉంది అని అన్నారు.కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని,బతుకమ్మను వెయ్యేళ్లుగా తెలంగాణలో జరుపుకుంటున్నారు అని ఇది తెలంగాణ అస్తిత్వానికి చిహ్నంగా నిలిచింది అని బతుకమ్మ పండుగ ప్రకృతిని అరాధించే పెద్ద పండుగ అని ప్రకృతి ప్రసాదించిన వివిధ రకాల పూలతో బతుకమ్మను అలంకరించి మహిళలు విద్యార్థినిలు సమూహంగా పాటలు పాడుతూ ఆడిపాడడం ద్వారా ఐక్యతను పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తుంది అని అన్నారు.కళాశాల సిబ్బంది విద్యార్థులు కలిసి బతుకమ్మను ఆడుతూ పాటలు పాడి పండుగను ఆనందంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమం లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి డాక్టర్ ప్రణతి,డాక్టర్ జ్యోతి డీన్ అకాడమిక్స్ డాక్టర్ వి సుదర్శన్ ఎలక్ట్రానిక్స్ విభాగ అధిపతి డాక్టర్ రాజేష్ ఎలక్ట్రికల్ విభాగ అధిపతి సిహెచ్ కృష్ణ ప్రసాద్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ చిరంజీవి కుమార్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

-చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రామిరెడ్డి



**చౌటుప్పల్.సెప్టెంబర్ 27. ప్రభాత సూర్య :** తెలంగాణ గర్వించదగిన గొప్ప నాయకుల్లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఒకరని,వారి సేవలు చిరస్మరణీయమని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పలువురు స్థానిక నాయకులతో కలిసి చౌటుప్పల మున్సిపల్ కేంద్రంలోని కాంస్య విగ్రహమునకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు బడుగు లక్ష్మయ్య మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా,డిప్యూటీ స్పీకర్గా పనిచేస్తూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన మహా నాయకుడని కొనియాడారు. చేతి వృత్తుల వారలకు చేతి సహకార సంఘాలను నెలకొల్పి సంఘాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. వారి ఆశయా లకు అనుగుణంగా నేటి యువతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రామిరెడ్డి,మునుగోడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జ్,బాపూజీ సేవా సమితి అధ్యక్షులు,మండల టిడిపి అధ్యక్షులు బడుగు లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ చిక్క నరసింహ, మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య గౌడ్, మాజీ ఎంపిటిసి గోశిక కరుణాకర్,చేనేత సంఘం మాజీ అధ్యక్షులు గుర్రం రవీందర్,దేవస్థాన కమిటీ అధ్యక్షులు గోశిక నరసింహ, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గోషిక వినయ్, అమృతం దశరథ, బడుగు శ్రీరాములు,టిడిపి మండల ఉపాధ్యక్షులు నల్ల పర్వతాలు యాదవ్, కార్యనిర్వాక కార్యదర్శి తడక కోటేశ్వర్, గుర్రం నరసిం,బడుగు జయప్రకాష్,గోశిక బాలరాజు, గోశిక ధనంజయ, గోశిక ప్రభాకర్, పబ్బతి శేఖర్ గౌడ్, కందగట్ల మదు, చౌట దేవేందర్ పాల్గొన్నారు.

# భగత్ సింగ్ కు భారతరత్న ప్రకటించాలి

- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధుకృష్ణ



**చౌటుప్పల్.సెప్టెంబర్ 27. ప్రభాత సూర్య :** స్వాతంత్ర సమరయోధుడు షాహిద్ భగత్ సింగ్ కు భారతరత్న ప్రకటించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధు కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం భగత్ సింగ్118వ జయంతి సందర్భంగా చౌటుప్పల్ మండలం, జైకేసారం గ్రామంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధుకృష్ణ ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పల్లె మధు కృష్ణ మాట్లాడుతూ... అతి చిన్న వయసులో దేశ స్వతంత్రం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడ లాడించి పరాయి దేశ పాలనను సహించని గొప్ప విప్లవ యోధుడు భగత్ సింగ్ అని అన్నారు. నేటి యువత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు బోదాసు నరేష్, నాయకులు బోదాసు వెంకటేశం, పల్లె శివకుమార్, డివైఎఫ్ఐ గ్రామ అధ్యక్ష కార్యదర్శులు పాలమాకుల రాకేష్, వనం విజయకుమార్, బొడిగె సైదులు, తుపాకుల సాయికుమార్,తలాటి రాజు, రుద్రగోని మధు, బోదాసు సుధాకర్ పాల్గొన్నారు.

## గట్టుప్పలలో కొండలక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమం



**గట్టుప్పల్ ప్రభాతసూర్య 28** గట్టుప్పల మండలంలో కొండలక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కర్నాటి వెంకటేశం మాట్లాడుతూ "బాపూజీ మళ్లీ నీవు పుట్టాలి, మా బ్రతుకులు మార్చాలి. చేనేత బతుకులు ఆకలి చావులు అన్నము రామచంద్రాన్ని బతుకుతున్నాయి. ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా మా జీవన ప్రమాణాలు మారలేదు. రైతు తర్వాత చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చేనేత వస్త్రం నేసే కూలీకి విలువ లేని పరిస్థితి నెలకొన్నదని, చేనేత అన్న భరోసా కూడా మాయమైందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పాలకులు విస్మరించారని విమర్శించారు. "చేనేతన్నను కాపాడండి ఓ పాలకులారా మీ గౌరవాన్ని నిలబెట్టుకోండి. లేకపోతే చేనేత కూలీ కట్టుకున్న బట్టలే మీకు భవిష్యత్తులో జవాబు చెబుతాయి" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు పుణ్య కిషోర్, మండల అధ్యక్షులు గంజి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంస్థాన్ లో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి ఉత్సవాలు



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 27( ప్రభాత సూర్య):** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు విడం సాయి కిషోర్ నేత మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం గైర్ ముల్కీ ఆందోళన తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర పోషించిన స్వతంత్ర సమరయోధులు మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ దేశానికి చేసిన సేవలు అమోఘమని చేనేత కుటుంబంలో జన్మించడం చాలా గౌరవ కారణమని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు, ఈ కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం సభ్యులు గర్దాస్ రాఘవేంద్ర, సూరపల్లి గణేష్,సింగం భాస్కర్, సంగిశెట్టి నరేష్, గుర్రం సత్యనారాయణ, గంజి రాజేష్, దోర్నాల శివ స్వామి, పద్మశాలి యువజన సంఘం సర్వ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న

కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గం మైనార్టీ నాయకుడు -యండి రహీం షరీఫ్



**సంస్థాన్ నారాయణపురం,సెప్టెంబర్ 27( ప్రభాత సూర్య)** కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల సందర్భంగా నగరంలోని సచివాలయం ఎదుట ఉన్న కొండ లక్ష్మణ్,బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గం మైనార్టీ నాయకుడు యండి రహీం షరీఫ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు రాజకీయనేత, ఉద్యమకారుడు కొండ లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు ఉద్యమాలు మరువలేనివి అని అన్నారు.

## లలిత త్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన

గణం నర్సింహ్మా కురుమ దంపతులు



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 27( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వరి నిత్య అన్నదాన ఆశ్రమంలో శ్రీశ్రీశ్రీ శంకరనంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రోత్సవాలు భాగంగా ఐదో రోజు లలిత త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గణం నరసింహ కురుమ దంపతుల కుటుంబ సమేతంగా విచ్చేసి కుంకుమ అర్చనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాదేవి అమ్మవారి దీక్షపరులు, భక్తులు, ఆశ్రమ నిర్వాహకులు,తదితరులు పాల్గొన్నారు

## కుమ్మరి సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా సిలివేరు నరేష్




**చౌటుప్పల్. సెప్టెంబర్ 27. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండల కుమ్మరి సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా సిలివేరు నరేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని కుమ్మరి సంఘం మండల మండలఅధ్యక్షుడు సిలువేరు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సిలువేరు నరేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మండల, వివిధ గ్రామల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, గౌరవ అధ్యక్షులు సిలివేరు జంగయ్య, మండల అధ్యక్షులు సిలివేరు శ్రీనివాస్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కుమ్మరుల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సిలువేరు నరేష్ మండల కుమ్మరి సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా నియామకం కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం, జిల్లా అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి, కుమ్మరి గ్రామ శాఖ అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, కుమ్మరి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను నేటి తరం కొనసాగించాలి

-భాజపా మండల అధ్యక్షులు కైరం కొండ అశోక్

**చౌటుప్పల్.సెప్టెంబర్ 27. ప్రభాత సూర్య:** స్వాతంత్ర సమరయోధుడు , నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను సేవలను నేటితరం స్ఫూర్తిగా తీసుకొని కొనసాగించాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కైరం కొండ అశోక్ అన్నారు. శనివారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ చౌటుపల మండల అధ్యక్షులు కైరంకొండ అశోక్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కారం కొండ అశోక్ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం పోరాటాలకు, త్యాగాలకు మారుపేరుగా నిలిచిందని అన్నారు. చిన్నతనం నుంచి నిజం నిరంకుశ పాలన, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారని, 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బడుగు లక్ష్మయ్య, అమృత దశరథ, పబ్బతి శేఖర్ గౌడ్,గుర్రం రవీందర్, ఆల్మసిపేట గౌతమ్, కర్నాటి శివ గౌడ్, రవీందర్, తడకా కోటేష్, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.



## దుర్గామాతకు ఘనంగా కుంకుమార్చన



**చౌటుప్పల్.సెప్టెంబర్ 27. తర్వాత సూర్య:** చౌటుప్పల్ మున్సిపాలిటీలోని హనుమాన్ నగర్ కాలనీలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత ఉత్సవాల సందర్భంగా శనివారం మహిళా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు కుంకుమార్చన పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. తమ సౌభాగ్యాన్ని నిండు నూరేళ్లు కాపాడాలని ఆ అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు మాజీ కౌన్సిలర్ కామిశెట్టి శైలజ భాస్కర్ గుప్తా, మహిళా భక్తులు ఇందిర, నిర్మల, కావ్య, పూజిత, స్వాతి, అనూష, భవాని, లక్ష్మి,మేఘన, శ్రీజ, ఉమా, పార్వతి, లక్ష్మి, సంగీత, లలిత, లల్లి, నవ్య, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలు మెచ్చిన పబ్లిక్ లీడర్ కొండా లక్ష్మణ్ బాపూజీ

-పన్నాల గోపాల్ రెడ్డి



**ఖమ్మం( సూర్య ప్రతినిధి )** భారత స్వాతంత్ర సమరయోధుడు సామాజిక చైతన్య స్ఫూర్తిధాత బడుగు బలహీన వర్గాల బంధువు తెలంగాణ తొలిదశ ఉద్యమ నేత మలిదశ పోరాట ఉద్యమ సూరీడు.తెలంగాణ రాష్ట్రం కోసం.తన ఇల్లు జలదృశ్యంను తెలంగాణ కేంద్రంగా మలచిన మహనీయులు అని తెలంగాణ జన సమితి పార్టీ నేత పొన్నాల నాగిరెడ్డి అన్నారు. నిన్న చిత్రపటానికి తినే వాళ్ళు అర్పించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన త్యాగశీలి 92 ఏళ్ల వయస్సులో కూడా తెలంగాణ రాష్ట్రం కోసం ఢిల్లీ జంతర్ మంతర్ లో దీక్ష చేసి బరి గీసి కొట్లాడిన ధీరుడు.పద్మశాలీల ఆరాధ్యుడు సమాజం హితం కోసం ఇచ్చిన మాట కోసం తన రాజకీయ జీవితాన్ని త్యాగం చేసిన దీరోధత్తుడు అని ప్రశంసించారు

## శ్రీ గాయత్రి కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**చౌటుప్పల్.సెప్టెంబర్ 27. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని శ్రీ గాయత్రీ కళాశాలలో శనివారం విద్యార్థులు ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బండారు మయూర్ రెడ్డి, కరస్పాండెంట్ భీమిడి సుభాష్ రెడ్డి లు పాల్గొని మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకని కొనియాడారు.ప్రకృతిలోని పూలను పూజించటం, ఆరాధించడం తెలంగాణ ప్రజల జీవన విధానంలో గొప్ప అనుభూతిని పంచుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దయాకర్, ఆంజనేయులు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంస్కృతి సంప్రదాయాలు ప్రతీక బతుకమ్మ

శ్రీరాముల భూక్య ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్

**నల్గొండ సెప్టెంబర్ 27 ప్రభాత సూర్య** నల్గొండ పట్టణం మిర్యాలగూడ రోడ్డు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాముల భూక్య ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాముల భూక్య మాట్లాడారు తెలంగాణ మహిళల ఆత్మీయత ఆధ్యాత్మికత సాంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రత్యేక నిలుస్తుందని అన్నారు పకృతిని దైవంగా పూజించి పండుగ బతుకమ్మ నిలుస్తుంది ఇలాంటి పనులు నిర్వహించడం ద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలుపవచ్చు అని తెలిపారు. మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి



పాటలు పాడి బతుకమ్మ పండుగ సంబరాలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండ లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ఇవ్వాలి

-తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు

గట్టు మొగలయ్య ముదిరాజ్

**చౌటుప్పల్. సెప్టెంబర్ 27. ప్రభాత సూర్య :** తెలంగాణే ఊపిరిగా,ప్రత్యేక రాష్ట్ర సాధనే తన ధ్యేయంగా బ్రతికి తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవికి రాజీనామా చేసిన వీర యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ కి భారతరత్న ఇవ్వాలని గట్టు మొగులయ్య అన్నారు. శనివారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గట్టు మొగలయ్య మాట్లాడుతూ... ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చిన్నతనం నుంచి నిజాం నిరంకుశ పాలన, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారని, స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించేందుకు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా,



డిప్యూటీ స్పీకర్ గా విశేష సేవలు అందించాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు గట్టు మొగలయ్య ముదిరాజ్, జెట్ట కృష్ణ కురుమ, శివ కుమార్, పరమేష్ పాల్గొన్నారు .

## కొండా లక్ష్మణ్ బాపూజీ కి ఘన నివాళి

**నల్గొండ సెప్టెంబర్ 27 క్రైమ్ కౌంటర్ న్యూస్** చేనేత భరోసా అమలుచేసి కార్మికులను ఆదుకోవాలి స్వాతంత్ర సమరయోధుడు బడుగు బలహీన వర్గాల పితామహుడు కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో చేనేత వృత్తి రక్షణ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టిన నాడే వారికి నిజమైన నివాళి అని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ అన్నారు శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని పాలకేంద్రం దగ్గర గల ఆయన విగ్రహానికి తెలంగాణ చేనేత కార్మిక సంఘం, తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. చేనేత భరోసా రుణమాఫీ ప్రకటించి సంవత్సరం పూర్తయిన అమలు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గంజి నాగరాజు, మహిళా కార్యదర్శి మిర్యాల శ్రీవాణి, సంఘ సభ్యులు వనం రాములు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పసునూరి యోగానందం, సురపల్లి భద్రయ్య,



గంజి రాజేష్, మిరియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## న్యూ రాఘవేంద్ర కాలనీలో దేవి నవరాత్రి ఉత్సవాలు



**నల్గొండ సెప్టెంబర్ 27 ప్రభాత సూర్య** నల్గొండ పట్టణం న్యూ రాఘవేంద్ర నగర్ కాలనీలో శనివారం దేవి నవరాత్రుల ఉత్సవాల భాగంగా అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంగా దుర్గామాత భక్తులకు దర్శనం ఇచ్చారు అనంతరం కాలనీవాసులు అభిషేకం, అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో సాయికుమార్, మణికుమార్, సంతోష్ రెడ్డి, మాంద్ర వినయ్, విగ్రదాత మల్లికార్జున్ అంకిత, తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామం లో బతుకమ్మ సంబరాలు...




**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాదాపూర్ లో నీ శిల్పారామం లో నవరాత్రి, బతుకమ్మ మరియి దసరా సంబరాలు అండ్ సారీస్ అఫ్ ఇండియా మేళ ను నిర్వహిస్తున్నారు. డెవలప్మెంట్ అఫ్ కమీషనర్ హ్యాండ్లూమ్స్, గవర్నమెంట్ అఫ్ ఇండియా మరియువీవెర్స్ సర్వీస్ సెంటర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యం లో దాదాపుగా వంద చేనేత స్టాల్ప్ ఏర్పాటుచేయడం జరిగాయి. బనారస్, చెందేరి, కోట, గుజరాతీ, ఉప్పాడ, బనారస్, కాశ్మీరీ, మొదలైన చీరలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి.

## లలిత త్రిపుర సుందరిదేవి అవతారంలో అమ్మవారు

మహిళలచే కుంకుమ అర్చన కార్యక్రమం



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 27( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని చిమిర్యాల గ్రామంలో శ్రీ విజయదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గ శరన్నవరాత్రుల సందర్భంగా 6 రోజు అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలచే కుంకుమ అర్చన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాదేవి ఉత్సవ కమిటీ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వరి నిత్య అన్నదాన ఆశ్రమంలో దుర్గాదేవి ఉత్సవాలు

శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో అమ్మవారు

మహిళలచే కుంకుమార్చన కార్యక్రమం



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 26( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రము లోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వరి నిత్య అన్నదాన ఆశ్రమంలో 6వ రోజు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం మహిళలచే కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అన్నప్రసాదల సేవ కూడా చేపట్టడగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు శ్రీశ్రీశ్రీ శంకరానంద స్వామి భక్తులు పాల్గొని అమ్మ కృపకు పాత్రులు కావాలని కోరారు.


## ఏకరూప దుస్తులు అందజేత




**చౌటుప్పల్.సెప్టెంబర్ 27. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ యార్డులో పని చేసే హమాలీలు, దడవాయి, చాటవాల లకు శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ గౌస్ ఖాన్, చిమ్మల వెంకటరెడ్డి, సుర్వి వెంకటేష్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

**నల్గొండ సెప్టెంబర్ 27 ప్రభాత సూర్య** స్వతంత్ర సమరయోధుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నల్లగొండ లోని ఆయన విగ్రహానికి సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మెన్ డా. బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్ పూల మాల వేసి నివాళి అర్పించారు. శనివారం జల సాధన సమితి అధ్యక్షులు దుష్యర్ల సత్యనారాయణతో కలిసి కొండ లక్ష్మణ్ బాపూజీ కి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డా.కేశవులు ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన వ్యక్తి కొండ లక్ష్మణ్ బాపూజీ అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ఉద్యమంలో ఆయన పాత్రను, త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నోముల క్రాంతి యాదవ్, మెడి యాదయ్య, నిరంజన్, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# దుర్గామాత సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం

– బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్

**చౌటుప్పల్. సెప్టెంబర్ 27. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మున్సిపాలిటీ తాళ్ల సింగారం గ్రామంలోని దుర్గమ్మ గుడి లో దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ పాల్గొని శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వారిని పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుర్గమ్మ సన్నిధిలో అన్నదాన కార్యక్రమానికి తనను ఆహ్వానించి తనతోటి ప్రారంభించిన ఉత్సాహ కమిటీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అమ్మవారి ఆశీర్వాదంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రజలు సుఖ



సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి పూజలు నిర్వహించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఎస్సై అజయ్ భార్గవ్, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, సుర్వి మహేష్, బాతరాజు నగేష్, బొంగు రాజు, బొంగు నగేష్,



బత్తుల రాజు, గోపగోని వెంకటేష్ గౌడ్,నల్ల గణేష్, బొంగు వెంకటేష్, ఉష్కాగుల సురేష్, నల్ల అంజయ్య, వెంకటేష్, గ్రామ పెద్దలు, భవాని మాలాదారులు, కమిటి నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అమ్మవారి పూజల్లో పాల్గొన్న పాలకూరి నరసింహ గౌడ్ రమాదేవి దంపతులు

కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

దంపతులను సన్మానించినా ఆలయ కమిటీ



**మునుగోడు, సెప్టెంబర్ 27( ప్రభాత సూర్య) :** మునుగోడు మండల కేంద్రంలోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయములో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం రోజు లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు..గ్రామ పంచాయతీ మాజీ కో ఆప్షన్ సభ్యులు పాలకూరి నరసింహ గౌడ్ రమాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు..ఆలయ అర్చకులు నరసింహ గౌడ్ దంపతులను శాలువాతో సన్మానించి ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు..పాలకూరి నరసింహ గౌడ్ మాట్లాడుతూ అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు సుక సంతోషాలతో ఉండాలని కోరారు..ఆలయ అర్చకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

## బతుకమ్మ ఉత్సవాలు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం లాంటివి

రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్



**గండిపేట్, సూర్యా ప్రతినిధి** బతుకమ్మ ఉత్సవాలు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంలాంటివని తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అన్నారు. శనివారం తెలంగాణ పోలీస్ అకాడమీ లో బతుకమ్మ సంబరాలను అకాడమీలోని రాణిరుద్రమ దేవి ఆడిటోరియం ఎదుట అకాడమీ మహిళా అధికారులు,సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ హాజరై జ్యోతి వెలిగించి బతుకమ్మ సంబరాలు ఘనంగా ప్రారంబించారు. ఈ సంబరాల్లో రంగురంగుల పూలతో పేర్చిన పూలగుత్తులను ఆడిటోరియం ముందు అమర్చి చుట్టూ నృత్యాలతో అలరించారు. ఈ సంబరాల్లో డైరెక్టర్, మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొని తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే బతుకమ్మ పాటలతో, నృత్యాలతో సంబరాలను ఘనంగా నిర్వహించారు.

## బీజేఎంసీ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



**గండిపేట్, సూర్య ప్రతినిధి** బతుకమ్మ ఉత్సవాలు మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతాయని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర అన్నారు. శనివారం బతుకమ్మ ఉత్సవాలను కార్పోరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో మహిళ అధికారులు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు సంప్రదాయపూలతో, సాంస్కృతిక వైభవంతో, అందంగా బతుకమ్మలు పేర్చారు. అందంగా బతుకమ్మలు పేర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డి.చంద్రశేఖర్ రెడ్డి, వివిధ సెక్షన్ల అసిస్టెంట్లు, వార్డు అధికారులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఆర్పీలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

## పోటీ ప్రపంచంలో నిలబడాలంటే సాంకేతికనైపుణ్యాలనుపెంపొందించుకోవాలి





యువతలో నైపుణ్యం పెంచేందుకే

అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ లు.

సంగారెడ్డి లో ఏటీసీ సెంటర్ను ప్రారంభించిన

మంత్రి దామోదర నరసింహ.

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 27:** రాష్ట్రంలో 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో హైదరాబాద్ నుండి ప్రారంభించారు. ఈ కార్యక్రమం సంగారెడ్డి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కేంద్రం ప్రారంభోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేకంగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని యువకుల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అన్ని జిల్లాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లను ప్రారంభిస్తున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం సంగారెడ్డి లో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య,ఎస్పీ పరితోష్ పంకజ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన పిల్లలు పోటీ ప్రపంచంలో నిలబడాలంటే సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యవసరమని ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని దాన్ని గుర్తించి దిశా నిర్దేశ్యం చేస్తే భవిష్యత్తులో ఆ పిల్లలు ధైర్యంగా స్వయంకృషితో ఎదగగలరు అని మంత్రి అన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి విద్యార్థులు, యువకుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నది అన్నారు. సంగారెడ్డి ఐటిఐ 1963లో ప్రారంభించబడిందన్నారు. 63 సంవత్సరాల చరిత్ర కలిగిన ఐటిఐగా సంగారెడ్డి ఐటిఐ గుర్తింపు పొందిందని అన్నారు. ఈ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందిన ఎంతోమంది బిహెచ్ఇఎల్, ఓడిఎఫ్, బీడీఎల్ లాంటి జాతీయ కంపెనీలలో ఉద్యోగాలు పొందారన్నారు. ప్రస్తుతం ఐటిఐ తో ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని ఐటిఐ తో పాటు ,ఇతర నైపుణ్యాలలో అడ్వాన్సుడ్ టెక్నాలజీ పై శిక్షణ అందిస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి అన్న ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. అందులో భాగంగా జిల్లాలో మూడు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి, పటాన్చెరు, హత్నూర ఐటిఐ లలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ఏటిసి కేంద్రం ఏర్పాటుకు సుమారు 40 కోట్ల రూపాయలను అధునాతన పరికరాలకు కొనుగోలు కోసం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సహాయకారంతో ప్రభుత్వం వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాలలో విద్యార్థులకు ప్రత్యేకంగా సాంకేతిక రంగంలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలన్నట్లు తెలిపారు రాబోయే రోజుల్లో ఈ కేంద్రాలు విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలను నేర్పి పోటీ ప్రపంచంలో విజయవంతంగా ఉపాధి పొందేందుకు సహాయపడతాయి అన్నారు. కేవలం అబ్బాయిలకే కాకుండా అమ్మాయిలకు కూడా స్ఫూర్తి పొందాలని అన్నారు . జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులు ఈ సెంటర్ ద్వారా కొత్త టెక్నాలజీలను నేర్చుకొని భవిష్యత్తులో స్వయంకృషితో ధైర్యంగా ముందుకు వెళ్తారన్న విశ్వాసాన్ని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య వ్యక్తం చేశారు. ట్రైనింగ్ కేంద్రంలో ఫ్యూచర్ జాబ్స్‌కు కావాల్సిన కొత్త టెక్నాలజీలు , స్కిల్స్ పై శిక్షణ అందిస్తున్నారు. గతంలో అడ్మిషన్ల లో సీట్లు నింపడం కష్టమయ్యేది , ఈసారి 172 సీట్లు ఓపెన్ చేసినందున 380 మంది కొత్త అడ్మిషన్స్ పూర్తి అయ్యాయి. ఇప్పుడు ఏటీసీ లో శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థికి భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు . విద్యార్థులు కళాశాలకు 100 హాజరు కావడానికి కృషి చేయాలని, విద్యార్థులు తమ సందేహాలను ఉపాధ్యాయుల నుండి స్పష్టంగా తెలుసుకుని, సహజంగా ఆచరించాలని సూచించారు. మన జిల్లాలో 4 వేలకు కి పైగా ఇండస్ట్రీస్ ఉన్నందున, ఈ ట్రైనింగ్ ద్వారా విద్యార్థులు ఆ ఇండస్ట్రీస్‌లో ప్లేస్‌మెంట్స్ పొందే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు . టీజీఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలను అమలుచేస్తుందని తెలిపారు . ప్రభుత్వం వచ్చిన తర్వాత 35 వేల ఉద్యోగాలు కల్పించడం గర్వకారణమని ఆమె తెలిపారు . రాష్ట్రంలో 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఈరోజు గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించడం గర్వించదగ్గ విషయం అని చెప్పారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, జహీరాబాద్ నిమ్జ్‌లో స్థానికులకు ప్రత్యేక అవకాశం కల్పించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని టీజీఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తెలిపారు . ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య , ఆత్మ కమిటీ చైర్మన్ రాంరెడ్డి , అదనపు లేబర్ కమిషనర్ గంగాధర్ , ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి లు పాల్గొన్నారు .

## సంగారెడ్డి కలెక్టరేట్లో ఘనంగా బతుకమ్మ పండుగ సంబరాలు

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు

ప్రతీక బతుకమ్మ పండుగ



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 27:** బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ , వ్యవసాయ శాఖ ,ఉద్యానవన శాఖ , పట్టణాభివృద్ధి సంస్థ ,మత్య శాఖ ల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఈ ఉత్సవంలో భాగస్వాములయ్యారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ,మాధురి , డి ఏ ఓ శివప్రసాద్ , ఈ డి ఎస్సీ కార్పోరేషన్ రామాచారి , అదనపు డి ఆర్ డి ఓ సూర్యారావు , తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని గౌరీమాతకు, రంగురంగుల పూలతో ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసిన బతుకమ్మలకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ ప్రాధాన్యతను చాటాయి. బతుకమ్మ గేయాలను ఆలపిస్తూ మహిళా ఉద్యోగులు, యువతులు, మహిళలు బతుకమ్మ ఆటలాడుతూ ఎంతో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యాలయ పనివేళలు ముగిసినప్పటికీ ఉద్యోగినులు ఎవరూ ఇళ్లకు వెళ్లకుండా ఎంతో హుషారుగా ఈ ఉత్సవంలో పాల్గొని బతుకమ్మ వేడుక ఔన్నత్యాన్ని చాటారు. ఈ ఉత్సవాల్లో వివిధ శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకారం దుర్గ భవాని



**నల్గొండ సెప్టెంబర్ 27 ప్రభాత సూర్య** నల్గొండ పట్టణం రవీందర్ నగర్ కాలనీలో శనివారం మహారాణా ప్రతాప్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో అఖిల్ రావు, రవి కిరణ్, మధుసూదన్ రెడ్డి, నవీన్, శంకర్, సన్నీ, రాహుల్, అఖిల్,హరి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలందరికీ బతుకమ్మ మరియు విజయదశమి శుభాకాంక్షలు...

తెలిపిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్...

శేరిలింగంపల్లి ప్రభాత సూర్య : తెలంగాణ ఆడపడుచులందరికీ బతుకమ్మ మరియు దసరా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నేత వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ వేడుకలుప్రతిబింబం అన్నారు.




## సంగారెడ్డి జిల్లాలో మద్యం దుకాణాలకు నోటిఫికేషన్

ఎక్సైజ్ శాఖకు డబ్బులె డబ్బులు

దరఖాస్తు ఫీజు3 లక్షలకు పెంచిన ప్రభుత్వం

డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ సంగారెడ్డి పేరు పై దరఖాస్తు చేయాలి

కులాల వారిగా దరఖాస్తు కుల ధ్రువీకరణ పత్రిని జత చేయాలి

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 27:** ప్రొహిబిషన్ ఎక్సైజ్ కమిషనర్, ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 202527 మద్యం పాలసీకి సంబంధించి సంగారెడ్డి జిల్లాలో మొత్తం 101 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి యస్. నవీన్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి స్టేషన్ పరిధిలో 24, పటన్చెరు 35, జహీరాబాద్ 16, నారాయణఖేడ్ 13, అందోల్ 13, మొత్తం 101 మద్యం దుకాణాలలో రెండు ఎస్.టి., 13 ఎస్.సి., 9 గౌడ కులస్తులకు రిజర్వేషన్ కల్పించబడిందని ఆయన వివరించారు. ఈ కేటాయింపులను జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా తీయడం ద్వారాకేటాయించడమైనది తెలిపారు . దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 18 వరకు జరుగుతుంది. ఆసక్తిగల అభ్యర్థులు సంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి కార్యాలయం లేదా నాంపల్లి లోని కమిషనర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో పని దినములలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఈ దరఖాస్తులకు అక్టోబర్ 23న ఉదయం 11 గంటలకు పోతిరెడ్డిపల్లి లోని జె.ఎన్.ఆర్. గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా కార్యక్రమం నిర్వహించబడనుంది. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేయదలచిన దరఖాస్తుదారులు రూ.3 లక్షల డిమాండ్ డ్రాఫ్ట్ ను "' గారి పేరుమీద సమర్పించాల్సి ఉంటుంది. మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్, పాన్ కార్డు ప్రతులు తప్పనిసరిగా జతచేయాలి. రిజర్వేషన్ కేటగిరీకి దరఖాస్తు చేసే వారు ప్రభుత్వంచే జారీ చేసిన కుల ధృవీకరణ పత్రం లేదా స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించాలని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి యస్. నవీన్ చంద్ర తెలిపారు . మరిన్ని వివరాలకు జిల్లా అధికారి 8712658904, జిల్లా సహాయ అధికారి 8712658907, సంగారెడ్డి సి ఐ 8712658912, పటన్చెరు, సి ఐ 8712658913, జహీరాబాద్ సి ఐ8712658914, నారాయణఖేడ్ సి ఐ 8712658915, అండోల్ సి ఐ 8712658916 , స్టేషన్‌ల సీఐల ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## పోటీ ప్రపంచంలో జీవించాలంటే విద్యార్థులకు మంచి అవకాశం..

ఏ టి సి సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీతా రెడ్డి..



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 27:**ప్రస్తుత పోటీ ప్రపంచంలో జీవించాలంటే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడానికి ఇది మంచి అవకాశమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు, శనివారం హత్నూర మండల కేంద్రంలోని ఆర్ ఐ టి ఐ లో ఏర్పాటు చేసిన నూతనంగా అడ్వాన్స్ సాంకేతిక కేంద్రాన్ని ఎమ్మెల్యే సునీతా రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా మోడ్రన్ టెక్నాలజీ అందిపుచుకునేందుకు ప్రభుత్వం ఏ టి సి లను ఏర్పాటు చేసిందని ఆమె సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ పెంచుకోవాలంటే ఇది చక్కటి అవకాశం అని ఆమె తెలిపారు. రాబోయే కాలంలో విద్యార్థులకు పోటీ ప్రపంచంలో ఎదిగేందుకు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. కావున విద్యార్థులు ఈ చక్కటి అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐటి టీజీ ఐఐ సి డిప్యూటీ జోనల్ మేనేజర్ ప్రభావతి. ఐ టి ఐ ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి, డిప్యూటీ తాసిల్దార్ దావూద్ అహ్మద్. బీఆర్ఎస్ నాయకులు కృష్ణా గౌడ్, వీరేశం గౌడ్, జగదీష్, రామచంద్రా రెడ్డి, సురేందర్ రెడ్డి, ఆగమయ్య, లక్ష్మీనారాయణ, పండుగ రవి కుమార్. కళాశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి దశలవారిగా పరిష్కారం

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**గండిపేట్, (సూర్య ప్రతినిధి)** ప్రజల సమస్యల పరిష్కారానికి దశలవారి పరిష్కారం చూపడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. నియోజకవర్గంలో అన్ని సమస్యలపై దృష్టి పెట్టానని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానన్నారు. శనివారం అండర్ డ్రైనేజీ పైప్ లైన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైప్ లైన్ నిర్మాణంతో బుద్వేల్ రైల్వే స్టేషన్ తో పాటు పలు కాలనీల ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ అండతో నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కోసం తన వంతుగా కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ధనంజయ్, ప్రేమ్ గౌడ్, జీవన్ గౌడ్, సరికొండ వెంకటేష్, కళ్లెం లక్ష్మారెడ్డి, సోమ శ్రీనివాస్ గుప్తా, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# భయపెట్టిన మూసీ

హైదరాబాద్

హైదరాబాద్ నగరాన్ని మూసీ నది వణికించింది. దాదాపు మూడు దశాబ్దాలలో ఎన్నడూ చూడని విధంగా ఉగ్రరూపం దాల్చింది. పరీవాహక ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరద పోటెత్తటంతో శుక్రవారం సాయంత్రం నుంచి నది గట్టుదాటి ప్రవహించింది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల గేట్లను ఒకేసారి ఎత్తడంతో శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా వరద వచ్చి నగరంపై పడింది. దీంతో ఎన్నడూలేని విధంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్)ను వరద ముంచెత్తిన విషయం తెలిసిందే. శనివారం కాస్త శాంతించినప్పటికీ వరద ఉధృతి కొనసాగింది. ఎంజీబీఎస్ బస్‌స్టేషన్‌ను తాత్కాలికంగా మూసివేశారు. మూసీ పరీవాహక ప్రాంతాలైన బాపూఘాట్ నుంచి మూసారాంబాగ్ బ్రిడ్జి వరకు అనేక లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, కాలనీలు నీటమునిగాయి. మూసానగర్, శంకర్‌నగర్, మలక్‌పేట తదితర చోట్ల ఇళ్లలోకి వరద నీరు చేరటంతో దాదాపు 3,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చాదర్‌ఘాట్ బ్రిడ్జి, ఎంజీబీఎస్ బస్‌స్టేషన్, మలక్‌పేటలోని పునరావాస కేంద్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందనతో కలిసి సందర్శించారు. వరద నీరు చేరటంతో చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ కాజ్‌వేలను మూసివేశారు. మూసారాంబాగ్ కాజ్‌వే పక్కనే నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జిని సైతం వరద నీరు తాకింది. నార్సింగి, హిమాయత్‌సాగర్ వద్ద సర్వీస్ రోడ్డును మూసివేశారు. మంచిరేవుల %-% నార్సింగి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పూరానా పూల్ బ్రిడ్జి వద్ద మూసీ ప్రమాదకర స్థాయికి చేరింది. శివాలయం నీటమునిగింది. ఆలయ పూజారి కుటుంబం గుడిలోనే చిక్కుకుపోవడంతో హైడ్రా సిబ్బంది క్రేన్‌రీ సాయంతో బయటికి తీసుకొచ్చారు. మూసీ వరద ఉధృతిపై అధికారులతో సీఎం రేవంత్ ఆరా తీశారు. ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ, విద్యుత్తు విభాగాలన్నీ అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు.

**కాస్త తగ్గిన వరద**

మూసీ నదికి శనివారం సాయంత్రానికి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. జంట జలాశయాల నుంచి మూసీలోకి వదులుతున్న వరద 36 వేల క్యూసెక్కుల నుంచి 15 వేల క్యూసెక్కులకు తగ్గింది. ఉస్మాన్‌సాగర్ జలాశయానికి 9,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, 11 గేట్లు తొమ్మిది అడుగుల మేర ఎత్తి దిగువకు 9,284 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. హిమాయత్‌సాగర్‌కు ఎగువ నుంచి 7,000 క్యూసెక్కుల వరద వస్తుండగా, నాలుగు గేట్లు 5 అడుగుల మేర ఎత్తి దిగువకు 6,420 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు

**రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో వర్ష భీభత్సం**

రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో శనివారం భారీ వర్షానికి పలు ప్రాంతాలు నీట మునిగాయి. వీర్‌శెట్టిపల్లి, సంగెంకలాన్, జీవన్గీ గ్రామాలను వరద చుట్టుముట్టింది. ఓగిపూర్ సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తూ జుట్టూరు వాగులో చిక్కుకున్న ఇద్దరు లారీ డ్రైవర్లను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి. కాగ్నా నది ఉధృతికి యాలాల మండలంలోని కోకట్ బ్రిడ్జి తెగిపోయింది. దీంతో తాండూరు, పరిగి, హైదరాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. విశ్వనాథ్‌పూర్ వాగు దాటే క్రమంలో కొందుర్గు మండలం వెంకిర్యాలకు చెందిన లింగమయ్య (42) కొట్టుకుపోయి మరణించాడు. కోట్‌పల్లి మండలం కొత్తపల్లికి చెందిన చింతకింది రవికుమార్ (35) కొత్తపల్లి చెరువు అలుగులో కొట్టుకుపోయిన చనిపోయాడు. బషీరాబాద్ మండలం జీవన్గీలోని కాగ్నా ఒడ్డున ఉన్న గోశాలను వరద ముంచెత్తటంతో గోవులను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సంగారెడ్డి జిల్లాలో శనివారం కూడా భారీ వర్షాలు కురిశాయి. మనూరు మండలంలో 9.2 సెం.మీల వర్షపాతం రికార్డయింది. సదాశివపేట మండలం పెద్దాపూర్‌లో ఉన్న హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు పంప్‌హౌజ్ పూర్తిగా నీట మునిగింది. దీంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు నీటిసరఫరాలో అంతరాయం ఏర్పడింది. కొండాపూర్ మండలం సైదాపూర్ గ్రామ శివారులో రహదారి కొట్టుకుపోవటంతో సదాశివపేట, టేకులపల్లి, అనంతసాగర్, మోమిన్‌పేటల వైపు రాకపోకలు నిలిచిపోయాయి. మునిపల్లి మండలంలో పంటలు నీట మునిగాయి. పత్తి, సోయా పంటలు దెబ్బతిన్నాయి. జహీరాబాద్ ప్రాంతంలో కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొండాపూర్ మండలంలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# పదేళ్ల పాలకులు.. నమ్మక ద్రోహులు

-మొదటిపేజీ తరువాయి

పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రెండు పర్యాయాలు అధికారంలో ఉండి సాధించలేని విజయాన్ని తాము సాధిస్తున్నామన్న అక్కసుతో, కడుపులో విషం పెట్టుకుని ఫలితాలను అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. నోటిఫికేషన్ నుంచి ఫలితాల ప్రకటన దాకా.. అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. ఒక్కో పోస్టుకు రూ.2 కోట్లు, రూ.3 కోట్లు తీసుకుని ఉద్యోగాలిచ్చామంటూ ఆరోపించారని, లక్షల రూపాయలు ఖర్చుచేసి పెద్ద పెద్ద న్యాయవాదులను నియమించుకున్నారని చెప్పారు. నియామకాలు పూర్తయితే తమకు వ్యాపారం ఉండదన్న దురుద్దేశంతో అశోక్‌నగర్‌లోని కొన్ని కోచింగ్ సెంటర్లు ప్రతిపక్షాలకు మద్దతుగా నిలిచాయని విమర్శించారు. అయితే.. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా.. తనకు గ్రూప్-1 అభ్యర్థుల భవిష్యత్తు మాత్రమే కనిపించిందన్నారు.

**ఇట్లుంటది తెలంగాణ..**

“కొంతమంది అప్పుడప్పుడు తెలంగాణ ఎక్కడున్నది? తెలంగాణ ఎట్లుంటది? అని అడుగుతున్నరు. వారందరికీ ఇక్కడి నుంచే చెబుతున్నా. తెలంగాణ ఇక్కడే ఉంది.. ఇట్లుంటది తెలంగాణ. ఇదే తెలంగాణ స్ఫూర్తి, తెలంగాణ చైతన్యం, తెలంగాణ భవిష్యత్తు” అని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణ గడ్డపై ప్రజలను మోసగించినోళ్లు చరిత్రలో కలిసిపోయారని చెప్పారు. అయినా.. కొంత మంది తాము కారణ జన్ములమని, తమ కుటుంబమే తెలంగాణ అని భావించారని పరోక్షంగా కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చివరికి వారు తెలంగాణ చరిత్రలో నమ్మకద్రోహులుగా నిలిచిపోయారన్నారు. పదేళ్లుగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించకుండా బాధ్యతారహితంగా వ్యవహరించారని, శ్రీకాంతచారి, యాద య్య, ఇషాన్‌రెడ్డి లాంటి వాళ్ల త్యాగాలను అపహాస్యం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఆర్ఎంపీ వైద్యులను టీజీపీఎస్సీలో సభ్యులుగా నియమించారని, దానిని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని రేవంత్ ధ్వజమెత్తారు. గ్రూప్-1 లాంటి రాష్ట్ర ఉన్నత ఉద్యోగులను నియమించే కమిషన్‌లో చిన్నపాటి ఉద్యోగులు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అందుకే గ్రూప్-1 ప్రశ్నపత్రాలు లీకయ్యాయని, జిరాక్స్ సెంటర్‌లో బయటపడ్డాయని అన్నారు. టీజీపీఎస్సీని యూపీఎస్సీ స్థాయిలో ప్రక్షాళన చేస్తామని తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేసి చూపించామన్నారు. డీజీపీగా పనిచేసిన వ్యక్తిని కమిషన్ చైర్మన్‌గా నియమించామని గుర్తు చేశారు. గత 40 ఏళ్లలో సాధించని దానిని.. తాము కేవలం 19 నెలల్లోనే గ్రూప్-1 పూర్తిచేసి చూపించామన్నారు.

**4 కోట్ల ప్రజల అభివృద్ధే లక్ష్యం కావాలి..**

“ఇక నుంచి తెలంగాణ యంత్రాంగాన్ని నడిపించే బాధ్యత మీపై ఉంది. మనమంతా కలిసి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం అవుదాం. దేశానికి కావాల్సింది గుజరాత్ మోడల్ కాదు.. తెలంగాణ మోడల్. మనమేంటో సత్తా చూపించాలి. నిన్నటివరకు మీరు నిరుద్యోగులు. రేపటి నుంచి ఆఫీసర్లు. అధికారులుగా బాధ్యతగా వ్యవహరించాలి. 4 కోట్ల ప్రజల అభివృద్దే లక్ష్యంగా ఉండాలి” అని గ్రూప్-1 విజేతలనుద్దేశించి సీఎం రేవంత్ అన్నారు. ఉద్యోగం సాధించిన వారికి, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ భవిష్యత్తు నిర్మాణం చేసేందుకు సహకారం అందించాలని కోరారు. “మీ భవిష్యత్తు కోసం శ్రమించిన తల్లిదండ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత మీదే. మీకోసం వారి జీవితాన్ని త్యాగం చేశారు. తల్లిదండ్రుల విషయంలో నిర్లక్ష్యం వహి స్తే మీ జీతాల్లో నుంచి 10శాతం కట్ చేసి.. వారి ఖాతాల్లో వేస్తాం. దీనికి సంబంధించి త్వరలో చట్టం తేబోతున్నాం” అని సీఎం అన్నారు. అనంతరం గ్రూప్-1 విజేతలకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారంతా సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. “మీ పట్టుదలతోనే మా కల సాకారమైంది” అని పలువురు తీవ్ర భావోద్వేగంతో అన్నారు. సమావేశం తర్వాత సీఎం వెలుపలికి వస్తున్నప్పుడు కొందరు తల్లిదండ్రులు సీఎంను కలిసి పాదాభివందనం చేయబోగా.. ఆయన అడ్డుకున్నారు.

**ఐటీఐలలో ఏటీసీ కేంద్రాలు ప్రారంభం**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఐటీఐలతోపాటు హైదరాబాద్ నగరంలోని అల్వాల్ ఐటీఐలో శనివారం అధునాతన సాంకేతిక కేంద్రాలు (ఏటీసీలు) ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడి మల్లేపల్లిలోని ఐటీఐ ప్రాంగణం నుంచి వర్చువల్‌గా వీటిని ప్రారంభించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో, నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో, అమ్రాబాద్ మండలం మన్ననూరులో, వనపర్తిలోని నాగవరం శివారులో ఉన్న ఐటీఐలలో ఈ కేంద్రాలను ప్రారంభించగా.. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. మరోవైపు అల్వాల్ ఐటీఐ ప్రాంగణంలో టాటా టెక్నాలజీస్ సహకారంతో రూ.6.76 కోట్లతో నిర్మించిన ఏటీసీని ప్రారంభించారు.

## మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు!

-మొదటిపేజీ తరువాయి

ప్రతిపాదించగా ఇందులో రూ.3.08 కోట్లు ఇప్పటికే విడుదలయ్యాయి. రాష్ట్రంలో 1,67,03,168 మంది గ్రామీణ ఓటర్లు ఎన్నికల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది.

**ముఖ్యాంశాలు ఇలా...**

రాష్ట్రంలోని 12,760 గ్రామ పంచాయతీలు, 1,12,534 వార్డులు, 5,763 ఎంపీటీసీలు, 565 జడ్పీటీసీలకు ప్రత్యక్షంగా, 565 మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు), 31 జడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాలకు పరోక్షంగా ఎన్నికలు జరుగుతాయి. మొత్తం పంచాయతీల్లో వందశాతం ఎస్టీ లున్న పంచాయతీలు 1,248, షెడ్యూల్డ్ ప్రాంతాల్లోనివి 1,289, ఇతర ప్రాంతాల్లోనివి 10,223. రాష్ట్రంలో 11 గుర్తింపు పొందిన పార్టీలు, 31 నమోదు పార్టీలు తమ గుర్తులపై జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పాల్గొంటాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతాయి.

**మహిళా ఓటర్లే ఎక్కువ**

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని మొత్తం 1,67,03,168 మంది ఓటర్లలో 85,36,770 మంది మహిళలు, 81,65,894 మంది పురుషులు.. 504 మంది ఇతరులు.

**సమస్యాత్మక కేంద్రాలు**

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం మొత్తం 31,377 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఇందులో 8,123 సమస్యాత్మక, 8,113 అతి సున్నిత, 515 అత్యంత సున్నితమైనవి. 1,12,720 పంచాయతీ పోలింగ్ కేంద్రాల్లో 19,774 సమస్యాత్మకం, 21,093 అతి సున్నిత, 2,324 అత్యంత సున్నితమైనవి.

**బ్యాలెట్ బాక్సులు**




ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు 37,652, పంచాయతీ ఎన్నికలకు 1,35,264 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగా 1,18,547 సిద్ధం చేశారు.

**ఎన్నికల సిబ్బంది**

జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు 651 మంది, ఎంపీటీసీ ఎన్నికలకు 2,337 మంది ఆర్వోలు, 2,340 మంది ఏఆర్వోలు, 39,533 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,58,725 మంది ఇతర సిబ్బంది పాల్గొంటారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 4,956 మంది ఆర్వో మొదటి దశ, 14,407 మంది ఆర్వో రెండో దశ, 79,798 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,03,318 మంది ఇతర సిబ్బంది పాల్గొంటారు.

**ఎన్నికల దశలు ఇలా..**

పంచాయతీ ఎన్నికలు మొదటి దశలో 41 మండలాల్లోని 1,098 చోట్ల జరుగుతాయి. ఇక్కడ 9,324 వార్డులున్నాయి. రెండో దశలో 272 మండలాల్లోని 5,910 గ్రామాల్లో నిర్వహిస్తారు. 52,190 వార్డులున్నాయి. మూడో దశలో 252 మండలాల్లోని 5,752 గ్రామాల్లో చేపడతారు. ఇక్కడ 51,020 వార్డులున్నాయి. మొదటి దశలో 290 జడ్పీటీసీలు, 2,977 ఎంపీటీసీలు, రెండో దశలో 275 జడ్పీటీసీలు, 2,786 ఎంపీటీసీల్లో ఎన్నికలు జరుగుతాయి.

## బీసీ రిజర్వేషన్ల పెంపుపై అంత తొందరెందుకు?

-మొదటిపేజీ తరువాయి

పెంపుపై మీ స్ఫూర్తి దెబ్బతింటుందని కదా అని ప్రశ్నించింది. చట్ట ప్రకారం తాము ఇచ్చే తీర్పుమేరకే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని హైకోర్టు తేల్చి చెప్పింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం తెలిపినా, ఆ బిల్లును ఇంకా గవర్నర్ ఆమోదించలేదని స్పష్టం చేసింది. బిల్లు పెండింగ్‌లో ఉండగా, జీఓ ఎలా జారీ చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ దశలో రిజర్వేషన్ల పెంపును ఆమోదించలేం.. అలాగని ఇప్పటికిప్పుడు ఎలాంటి నిలిపివేత ఆదేశాలు జారీ చేయలేమని చెప్పింది. ఇరువైపులా పూర్తి వాదనలు విని.. తుది ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణ అక్టోబర్ 8కి వాయిదా వేసింది. ఆలోగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినా పిటిషన్లు ముందే దాఖలు చేసినందున మెరిట్ ఆధారంగా విచారణ చేస్తామని చెప్పింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓను కొట్టివేయాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డితోపాటు మరొకరు హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజే సూచన మేరకు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది.

**చట్టప్రకారం 50 శాతానికి మించొద్దు**

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు మయూర్‌రెడ్డి, ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. ‘స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 42 శాతానికి పెంచారు. ఇప్పటికే ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లున్నాయి. తాజా పెంపుతో మొత్తం రిజర్వేషన్లు 67కు చేరాయి. ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధం. ఆర్టికల్ 200 ఉల్లంఘనే. మొత్తం వర్టికల్ రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, కృష్ణమూర్తి, వికాశ్‌కిషన్ గవాయ్.. కేసుల్లో అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 28ఏ ప్రకారం కూడా పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దు. చట్ట సవరణ చేయకుండా జీఓతో రిజర్వేషన్ల పెంపు చెల్లదు. బీసీ రిజర్వేషన్లు 35 శాతానికి పెంచుతూ 2018లో జీఓ ఇచ్చినా.. ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది’అని పేర్కొన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ఇంకా నోటిఫికేషన్ ఇవ్వలేదు కదా అని ప్రశ్నించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని మయూర్‌రెడ్డి చెప్పారు. రిజర్వేషన్ల పెంపుతో ఎస్సీలకు ఏం ఇబ్బందని.. మీ కోటా అలాగే ఉంటుందని కదా అని ధర్మాసనం అడిగింది. జనరల్ కోటాలో అవకాశం తగ్గుతుందని ప్రభాకర్ బదులిచ్చారు. ప్రధానంగా పిటిషన్లు వేసింది రిజర్వేషన్లతో ఇబ్బంది గురించి కాదని.. రాజ్యాంగ ఉల్లంఘనపైనని వెల్లడించారు.

**పెంపు రాజ్యాంగ ఉల్లంఘనే...**

రాజకీయ పార్టీలతో ఈ ఎన్నికలకు సంబంధం ఉండదు కదా అని ధర్మాసనం అడగ్గా.. పార్టీలు బలపరుస్తాయని ప్రభాకర్ చెప్పారు. ఎన్నికల్లో ఎవరు అభ్యర్థి అయినా ప్రజలే కదా ఎన్నికయ్యేది అని ధర్మాసనం పేర్కొంది. అలా భావిస్తే జీఓనే అవసరం లేదని, రాజ్యాంగం కొన్ని హద్దులు విధించిందని ప్రభాకర్ అన్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 17 శాతం చట్ట విరుద్ధంగా పెంచడం రాజ్యాంగ ఉల్లంఘనే అని మయూర్‌రెడ్డి అన్నారు. జీఓను అన్ని పార్టీలు సమర్థిస్తున్నట్టుంది.. ఏ పార్టీ వ్యతిరేకిస్తున్నట్టు లేదు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకగ్రీవ తీర్మానం చేశాయని అడ్వొకేట్ జనరల్ చెప్పారు. ‘బీసీ రిజర్వేషన్ల కోసం కమిషన్ వేసి జనాభాపై ప్రభుత్వం అధ్యయనం చేసింది. దాదాపు 53 శాతం బీసీ జనాభా ఉన్నందున 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. అసెంబ్లీలో తీర్మానం చేసింది. ఆ బిల్లును గవర్నర్‌కు పంపాం. గవర్నర్ ఆమోదం తెలిపాల్సి ఉంది. నోటిఫికేషన్ ఇచ్చినా, ఎన్నికల నిర్వహణకు దాదాపు 45 రోజుల సమయం పడుతుంది. ఇంత అత్యవసరంగా హౌస్ మోషన్ రూపంలో పిటిషన్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదు. దసరా సెలవుల తర్వాతకు వాయిదా వేయండి’అని కోరారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పిటిషన్ వేయడం సాధ్యం కానందునే అత్యవసర పిటిషన్లు వేశామని ప్రభాకర్ చెప్పారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌పై తీర్పు వచ్చే వరకు ఆగొచ్చు కదా, గతంలో గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా జీఓ జారీ చేసిన ఘటనలు ఉన్నాయా అని ఏజీని ప్రశ్నించింది. హైకోర్టు.. సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని గడువు విధించిందని, అందుకే త్వరగా ప్రక్రియ చేపడుతున్నామని ఏజీ బదులిచ్చారు. ఎన్నికలు నిర్వహించమని మాత్రమే హైకోర్టు చెప్పిందని.. రిజర్వేషన్లు పెంచమని కాదని ప్రభాకర్ నివేదించారు. తమిళనాడు రిజర్వేషన్ల పెంపును కూడా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందన్నారు.

**సుప్రీంకోర్టు తీర్పు తర్వాత..**

ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకొని.. రేపటి వరకు అవకాశం ఇస్తాం.. ప్రభుత్వం నుంచి వివరాలు తెలుసుకొని నోటిఫికేషన్‌పై సమాచారం ఇవ్వాలని లేదా ఇప్పుడే అడిగి చెప్పాలని సూచించింది. 10 నిమిషాల తర్వాత హాజరైన ఏజీ ఉన్నతాధికారులు అందుబాటులో లేరన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు గవర్నర్ వద్ద బిల్లుపై 3 నెలలు ఆగితే నష్టమేముందని, ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించొచ్చు కదా.. అప్పుడు రిజర్వేషన్లపై ఎలాంటి పిటిషన్ దాఖలు కాదు అని ధర్మాసనం అభిప్రాయపడింది. తాము ఇప్పుడు నిలుపుదల ఉత్తర్వులిస్తే ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపునకు చేసిన ప్రయత్నమంతా వృథా అవుతుందని వ్యాఖ్యానించింది. పిటిషన్లలో తీర్పు వచ్చే వరకు నోటిఫికేషన్ వాయిదా వేయాలని ఆదేశించాలని ప్రభాకర్ కోరారు. ఏ సామాజిక వర్గానికి వ్యతిరేకం కాదని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ఉల్లంఘనపైనే పిటిషన్లు వేశామని మరోసారి స్పష్టం చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఇప్పటికిప్పుడు జీఓ 9పై ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేమని స్పష్టం చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై రేపటి నుంచి విచారణ

-మొదటిపేజీ తరువాయి

అక్టోబరు ఐదో తేదీలోపు విచారించే అవకాశం ఉందని స్పీకర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు ఇరు వర్గాల వాదనలు స్పీకర్ వింటారు. ఒక్కో ఎమ్మెల్యేకు గంట సమయం కేటాయించారు. పిటిషనర్లుగా కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డిలు ఉండగా, ప్రతివాదులుగా ఆ నలుగురు ఎమ్మెల్యేలున్నారు. మొత్తం పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వగా, 8 మంది వివరణ ఇచ్చారు. వారిలో నలుగురిని సోమ, బుధవారాల్లో విచారించనున్నారు. దసరా తర్వాత మూడు, నాలుగు తేదీల్లో మిగిలిన నలుగురిని విచారిస్తారు. బార్బొడోసలో జరుగుతున్న కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో పాల్గొనేందుకు అక్టోబరు ఆరున స్పీకర్ ప్రసాద్ కుమార్ బయల్దేరి వెళ్లనున్నారు. అకోబరు23 వరకూ విదేశాల్లోనే ఉంటారు. ఈ నేపథ్యంలో అక్టోబరు ఐదులోపు అనర్హత పిటిషన్‌కు వివరణ ఇచ్చిన 8 మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి చేయాలని స్పీకర్ భావిస్తున్నారు. విచారణలో వాదనలు వినిపించేందుకు న్యాయవాదులను నియమించుకోవాలని ఇరువర్గాలను స్పీకర్ కార్యాలయం కోరింది. న్యాయవాదులను నియమించుకున్నట్లుగా టీఆర్ఎసఎల్పీ ప్రతినిధి శుక్రవారం స్పీకర్ కార్యాలయానికి లేఖ కూడా ఇచ్చినట్లు సమాచారం. సోమవారం విచారణ ప్రారంభం కానుంది. బీఆర్ఎస్ టిక్కెట్టుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాషగౌడ్, కృష్ణమోహన్‌రెడ్డి, సంజయ్ కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేయాలంటూ స్పీకర్‌కు బీఆర్ఎస్ పార్టీ పిటిషన్ ఇచ్చింది. స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదంటూ సుప్రీంకోర్టునూ ఆశ్రయించింది. సుప్రీంకోర్టు సూచన మేరకు విచారణ ప్రక్రియను ప్రారంభించిన స్పీకర్ పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది తాము పార్టీ మారలేదంటూ అఫిడవిట్ల పూర్వకంగా వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారులు కూడా వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు. ఈ నాలుగు రోజులు కేవలం విచారణ నడుస్తుదని, నిర్ణయం తీసుకునేందుకు స్పీకర్ మరికొంత సమయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

# కన్నీటి కరూర్



-మొదటిపేజీ తరువాయి

'ర్యాలీ'లు నిర్వహిస్తున్నారు. శనివారం... నామక్కల్, కరూర్‌లో సభలు ఏర్పాటు చేశారు. ఉదయం పది గంటలకు నామక్కల్ రావాల్సిన విజయ్... మూడు గంటలు ఆలస్యంగా అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం 3 గంటలకు కరూర్‌లోని వేలుచామిపురం వద్దకు విజయ్ వస్తారని నిర్వాహకులు ప్రకటించారు. కానీ... ఉదయం 11 గంటల నుంచే కరూర్ వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. తమ అభిమాన (కథా)నాయకుడిని చూసేందుకు యువకులతోపాటు... పిల్లలు, మహిళలూ భారీగా తరలి వచ్చారు. ఎండ మండిపోతున్నా లెక్క చేయకుండా గంటలకొద్దీ వేచి చూశారు. చివరికి... నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 7 గంటల తర్వాత విజయ్ అక్కడికి చేరుకున్నారు. తన సభల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న బస్సు పైకి ఎక్కి విజయ్ ప్రసంగం ప్రారంభించగానే... అభిమానులు ఉద్రూతలూగిపోయారు. ఆయన ప్రసంగం ముగియడానికి కొద్దిసేపటి ముందే తొక్కిసలాట మొదలైంది. తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అప్పటికే నీరసించిన జనంలో కొందరు స్పృహతప్పి పడిపోయారు. ఇది గమనించిన విజయ్ టీమ్ అప్రమత్తమైంది. విజయ్ కూడా తన ప్రసంగాన్ని ఆపివేసి... బస్సు పైనుంచే వాటర్ బాటిళ్లు విసిరేశారు. విజయ్ అక్కడి నుంచి బస్సులో బయలుదేరగానే... పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. ఉదయం నుంచి ఎండలో ఉండి... మాడిపోయిన జనం ఒక్కసారిగా అక్కడి నుంచి కదిలారు. విజయ్‌ని స్పష్టంగా చూడాలని గోడలు, చెట్లు ఎక్కిన వాళ్లు కిందికి దూకారు. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. అసలే ఇరుకు రోడ్డు... చీకటి... అటు జన ప్రవాహం, ఇటు ఒకరిమీద ఒకరు పడటంతో తొక్కిసలాట మొదలైంది. పెను విషాదానికి ఇదే కారణమైంది.

**హాహాకారాలు... ఆర్తనాదాలు**

తొక్కిసలాట సమయంలో పోలీసులూ అసహాయులుగా మారిపోయారు. పరిస్థితిని అదుపులోకి తేవడం వారికి అసాధ్యంగా మారింది. చీకట్లో ఏం జరుగుతోందో ఎవరికీ అర్థం కాలేదు. తొక్కిసలాటలో చిక్కుకున్న జనం ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైపోయారు. 'సాయం చేయండి... ప్లీజ్... పోలీస్' అంటూ ఆర్తనాదాలు చేశారు. చాలామంది అక్కడే స్పృహ కోల్పోయారు. దారులన్నీ జనసంద్రంగా మారడంతో అంబులెన్స్‌లు కూడా వేగంగా చేరుకోలేకపోయాయి.

**కన్నీటి సంద్రంలా కరూర్ ప్రభుత్వాస్పత్రి**

క్షతగాత్రులను తరలించేందుకు సమారు 50 అంబులెన్స్‌లను ఉపయోగించారు. క్షతగాత్రులు, మృతదేహాలు, బాధిత కుటుంబీకుల రోదనలతో కరూర్ ప్రభుత్వాసుపత్రి శోకసముద్రంలా మారింది. ఒక్కో అంబులెన్సులో నలుగురైదుగురు క్షతగాత్రులను కూడా తీసుకొచ్చారు. ఇక్కడ 80 మందికి పైగా క్షతగాత్రులు ఈ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొంతమంది క్షతగాత్రులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు.

**విచారణకు ఆదేశం...**

ఈ విషాదంపై ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయంలో ఉన్నతస్థాయిలో సమీక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున అందిస్తామని ప్రకటించారు. అలాగే... ఈ ఘటనపై హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో న్యాయ విచారణకు ఆదేశించారు. ఆదివారం ఉదయం కరూర్ వెళ్లాలని భావించినప్పటికీ... శనివారం రాత్రికే ప్రత్యేక విమానంలో అక్కడికి చేరుకున్నారు. జరిగిన విషాదంపై విచారణకు ఆదేశించారు. ఇక... స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ తన దుబాయ్ పర్యటనను రద్దు చేసుకుని, విమానాశ్రయం నుంచి నేరుగా కరూర్ చేరుకున్నారు.

**నా గుండె బద్దలైంది: విజయ్**

కరూర్ నుంచి తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్న నటుడు విజయ్.. మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆయన దీనిపై ఒక ప్రకటన విడుదల చేశారు. "నా గుండె బద్దలైపోయింది. భరించలేని బాధతో విలవిలలాడుతున్నాను. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని విజయ్ పేర్కొన్నారు.

**ప్రముఖుల దిగ్భ్రాంతి**

కరూర్ విషాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తమిళనాడు గవర్నర్ రవి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితర ప్రముఖులు కూడా బాధితులకు తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

**అదుపు చేయలేకనే.. విషాదాలు**

ఫిబ్రవరిలో ఢిల్లీలోని రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రాణాలు కోల్పోయారు.. జూన్‌లో బెంగళూరులో ఆర్సీబీ జట్టు ఐపీఎల్ విజయోత్సవ కార్యక్రమం నేపథ్యంలో తొక్కిసలాట జరిగి 11 మంది చనిపోయారు.. ఇప్పుడు తమిళనాడులో విజయ్ రాజకీయ సభలో తొక్కిసలాటలో 38 మంది వరకు మృతి చెందారు.. వీటన్నింటికీ కారణం తక్కువ స్థలంలో ఎక్కువ మంది గుమిగూడటం, ఎవరికి వారు తామే ముందుకు దూసుకుపోవడానికి ప్రయత్నించడం.. అన్నింటికన్నా ముఖ్యంగా గుంపును కట్టడి (క్రౌడ్ మేనేజ్‌మెంట్) చేయలేకపోవడమే. మన దేశంలో రైల్వేస్టేషన్లు, బస్టాండులు, మార్కెట్లు, సినిమా హాళ్లు వంటివి ఎప్పుడూ కిక్కిరిసే కనిపిస్తాయి. ఇక జాతరలు, వేడుకల సమయంలో జనం గుమిగూడటమూ సాధారణమే. దానికితోడు సినీ నటుల కార్యక్రమాలు, రాజకీయ సభలు, ర్యాలీలకు భారీగా జనం పోటెత్తుతుంటారు. అలాంటి చోట్ల తొక్కిసలాట జరగకుండా జనాన్ని కట్టడి చేయడమే కీలకం. తగిన భద్రతా ఏర్పాట్లు చేయడం నుంచి ఆధునిక సాంకేతికతను వినియోగించడం దాకా ఇందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వరల్డ్ రీసోర్సెస్ ఇనిస్టిట్యూట్ ఇండియా నివేదిక ప్రకారం.. ఏ ప్రదేశంలోనైనా ప్రతి చదరపు మీటరుకు నలుగురు వ్యక్తులు ఉంటే అది కిక్కిరిసిన పరిస్థితి. అదే ఆరుగురి చొప్పున ఉంటే ప్రమాదకర పరిస్థితి. తొక్కిసలాటకు అవకాశం ఎక్కువ.

ప్రస్తుతం హెచ్‌డీ కెమెరాలు, అవి చిత్రీకరించే దృశ్యాల ఆధారంగా గుమిగూడిన జనం పరిస్థితిని విశ్లేషించే సాంకేతికతలు అందుబాటులోకి వచ్చాయి. ఎక్కడ ఎక్కువ జనం గుమిగూడారు? గుంపులో జనం ఎటువైపు కదులుతున్నారు? తొక్కిసలాట జరిగే పరిస్థితి నెలకొందా? అన్నది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. జనాన్ని నియంత్రించేలా, మరోవైపు మళ్లించేలా క్షేత్రస్థాయిలోని సిబ్బందిని సూచనలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇక భారీగా గుమిగూడిన జనం మధ్య అక్కడక్కడా ఖాళీ ప్రదేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని.. ఏదైనా ఇబ్బంది ఏర్పడితే తొక్కిసలాట జరగకుండా ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. జనం గుమిగూడిన ప్రాంతానికి సినీ నటులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు వస్తే.. వారిని చూడటానికి అంతా ఒక్కసారిగా ఎగబడి తొక్కిసలాటకు దారితీస్తుంది. అలాంటి సమయంలో కచ్చితమైన ముందుజాగ్రత్త చర్యలు చేపట్టేలా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. జనం కిక్కిరిసిపోయే పరిస్థితి ఏర్పడితే ముందుగానే జాగ్రత్తపడేలా ప్రజల్లో అవగాహన కల్పించడమూ కీలకం.

**ప్రభంజనం... ఆంక్షలు... వివాదాలు!**

ప్రేక్షకులకు, ప్రజలకు విజయ్‌గా సుపరిచితుడైన ఆయన పూర్తి పేరు... జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్! తమిళనాట 'ఇలయ దళపతి'గా పేరు తెచ్చుకున్నారు. తమిళనాట విజయ్ రాజకీయ రంగ ప్రవేశం పెను సంచలనం సృష్టించింది. గత ఏడాది 'తమిళ వెట్రి కళగం' (తమిళ విజయం పార్టీ) ఏర్పాటు చేశారు. అక్టోబరు 27న విల్లుపురంలో తొలి రాజకీయ సభకు భారీగా జనం తరలి వచ్చారు. ఆ తర్వాత... నిర్వహించిన సభల్లోనూ ఇదే పరిస్థితి. సభలకు వచ్చే జనాన్ని అదుపు చేయడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. దీంతో విజయ్ ప్రచారానికి పలు నిబంధనలు విధించారు. అయితే దీనిని సవాల్ చేస్తూ ఆయన పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. న్యాయస్థానం పోలీసుల నిబంధనల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూనే, అన్ని పార్టీల నేతల ప్రచారానికి ఒకే విధమైన నిబంధనలు

# కాళ్లబేరానికి వచ్చిందనే కనికరించాం!

ఐక్యరాజ్యసమితి

ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకోవడం వల్లనే భారత ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించిందంటూ ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలను అదే వేదిక నుంచి భారత్ గట్టిగా తిప్పికొట్టింది. పాకిస్తాన్ సైన్యం కాళ్లబేరానికి వచ్చి ప్రాధేయపడడం వల్లే దాడులు ఆపేశాం తప్ప ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం ఎంతమాత్రం లేదని తేల్చిచెప్పింది. భారత్, పాకిస్తాన్ ద్వైపాక్షిక వ్యవహారాల్లో మూడోపక్షం జోక్యాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని మరోసారి స్పష్టంచేసింది. ఐక్యరాజ్యసమితిలో భారత ప్రతినిధి పెటల్ గహ్లోత్ శుక్రవారం సాయంత్రం ఐరాస సాధారణ సభ(జనరల్ అసెంబ్లీ) సమావేశంలో ప్రసంగించారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై నిప్పులు చెరిగారు. అర్థంపర్థంలేని అసంబద్ధమైన మాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని గొప్పగా కీర్తించడం, ఆకాశానికి ఎత్తేయడం ఆయనకే చెల్లిందని ధ్వజమెత్తారు. పాకిస్తాన్ విదేశాంగ విధానానికి ఉగ్రవాదమే మూలస్తంభంగా మారిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో చావుదెబ్బ తిన్న పాకిస్తాన్ కింద పడినా తనదే పైచేయి అని చెప్పుకోవడానికి ఆరాట పడుతోందని ఎద్దేవా చేశారు. పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిందని, పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని ఉగ్రవాద స్థావరాలను, శిక్షణ కేంద్రాలను, ఎయిర్‌బేస్‌లను నేలమట్టం చేసిందని గుర్తుచేశారు. పెటల్ గహ్లోత్ ఇంకా ఏం మాట్లాడారంటే...

**అందుకేనా మీ సంబరాలు?**





" ఈ ఏడాది మే 7న ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైంది. భారత్‌పై మరిన్ని దాడులు చేస్తామంటూ మే 9 దాకా పాకిస్తాన్ బెదిరింపులకు దిగింది. వెంటనే దాడులు ఆపాలంటూ మే 10న భారత్‌ను పాక్ సైన్యం వేడుకుంది. మూడో వ్యక్తితో సంబంధం లేకుండా నేరుగా సంప్రదించింది. భారత సైన్యం చేపట్టిన వైమానిక దాడుల్లో భారీగా నష్టం వాటిల్లడంతో పాకిస్తాన్‌కు తత్వం బోధపడింది. ఆపరేషన్ సిందూర్‌లో పాక్ కీలక వైమానిక కేంద్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆ ఫొటోలు బయటకు వచ్చాయి. అవి ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా చూడొచ్చు. భారత్‌పై జరిగిన యుద్ధంలో విజయం సాధించామని షెహబాజ్ షరీఫ్ చెప్పుకుంటున్నారు. పూర్తిగా ధ్వంసమైన రన్‌వేలు, మంటల్లో కాలిపోయిన హ్యాంగర్లు ఆయనకు విజయంగా కనిపిస్తున్నాయా?

**ఉగ్రవాదులకు అధికారుల నివాళులా?**

పాకిస్తాన్ భూభాగంలోని బహవల్పూర్, మురిద్కేలో ఉగ్రవాద శిబిరాలు, శిక్షణ కేంద్రాలు నామరూపాల్లేకుండాపోయిన చిత్రాలు మనమంతా చూశాం. భారత సైన్యం దాడుల్లో కరడుగట్టిన ఉగ్రవాదులు హతమైపోయారు. వారి అంత్యక్రియలకు పాకిస్తాన్ సీనియర్ సైనికాధికారులు, ప్రభుత్వాధికారులు స్వయంగా హాజరయ్యారు. నివాళులర్పించారు. ముష్కరులను గొప్ప వ్యక్తులుగా పరిగణించడం పాకిస్తాన్ విధానమని మరోసారి తేలిపోయింది.

**వారిని శిక్షించాల్సిందే**

పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలను బలి తీసుకున్న 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్'ను ఏప్రిల్ 25న ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో వెనకేసుకొచ్చింది పాకిస్తాన్ కాదా? పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ భద్రతా మండలి జారీ చేసిన ప్రెస్ స్టేట్‌మెంట్‌లో టీఆర్ఎఫ్ పేరును ఎవరు తొలగించారు? డ్రామాలు, అబద్ధాలు నిజాన్ని కప్పిపుచ్చలేవు. పహల్గాం దాడికి కారణమైన ముష్కరులను, వారి పోషకులను చట్టం ముందు నిలబెట్టి శిక్షించాల్సిందే.

**ఉడత ఊపులకు భారత్ భయపడదు**

ఉగ్రవాదంపై భారత్ వైఖరి స్పష్టంగా ఉంది. ఉగ్రవాదులను, వారి పోషకులను వేర్వేరుగా చూడడం లేదు. భారత్ దృష్టిలో వారంతా ఒక్కటే. వారిని శిక్షించాల్సిందే. అణుబాంబులు ఉన్నాయని బెదిరిస్తూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తామంటే సహించే ప్రసక్తే లేదు. అలాంటి ఉడత ఊపులకు భారత్ ఎప్పటికీ భయపడదు. ఎవరికీ తలవంచదు. భారత్‌తో సమగ్ర చర్చలకు సిద్ధంగా ఉన్నామని షెహబాజ్ షరీఫ్ చెబుతున్నారు. చర్చలు జరగాలని ఆయన నిజాయితీగా కోరుకుంటే 'తొలుత పాకిస్తాన్ గడ్డపై ఉన్న ఉగ్రవాద కేంద్రాలన్నింటినీ మూసివేసి ఉగ్రవాదులను మాకు అప్పగించాలి. ఆ తర్వాతే చర్చలు. మతోన్మాదం, విద్వేషం, అసహనం అనే రొచ్చులో చిక్కుకున్న పాకిస్తాన్ ఐక్యరాజ్యసమితి వేదికపై విశ్వాసం, శాంతి గురించి బోధనలు చేయడం విచిత్రంగా ఉంది" అని పెటల్ గహ్లోత్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

## ప్రపంచ ఉగ్రవాద కేంద్రం పాకిస్థాన్

న్యూయార్క్

ఉగ్రవాదాన్ని అధికార విధానంగా కలిగిన పొరుగుదేశం(పాకిస్థాన్) ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా నిలిచిందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించరాదని, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం అందకుండా చూడాలని ఆయన ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో ప్రసంగిస్తూ చెప్పారు. ఉగ్రవాద మూలాలను ఉమ్మడిగా పెకిలించి వేయాలని ఆయన ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. పహల్గాంలో ఉగ్రవాదులు పాశవిక దాడి జరిపారని, ప్రతిగా భారత్ పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వసం చేసిందని చెప్పారు. గాజాలో శాంతి నెలకొనాలని, దీని కోసం భారత్ సహకరిస్తుందన్నారు. ఇదిలా ఉండగా, ఆపరేషన్ సిందూర్ వేళ కాల్పుల విమరణ విషయంలో మూడో దేశం ప్రమేయం లేదని.. మూడో వ్యక్తి ప్రమేయం అంతకన్నా లేదని భారత్ ఐరాస వేదికగా స్పష్టం చేసింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి పటేల్ గహ్లోత్ కీలక ప్రకటన చేశారు. "మే 9వ తేదీ వరకు భారత్‌పై కాల్పులకు పాల్పడుతూ.. పాక్ బెదిరింపు ధోరణిని ప్రదర్శించింది. కానీ, మే 10న భారత్‌తో పాక్ సైన్యం కాళ్లబేరానికి వచ్చింది. అయితే.. పాక్ ప్రధాని..తమ దేశంలో ధ్వంసమైన రన్‌వేలు తమ విజయమని భావిస్తే.. వారు ఆనందించవచ్చు" అని ఎద్దేవా చేశారు.

# గ్రీన్‌కార్డుకు కఠిన నిబంధనలు

**నేచురలైజేషన్ పరీక్షలో రెండు అవకాశాలు మాత్రమే**
**రెండో ప్రయత్నంలో విఫలమైతే పౌరసత్వం రానట్లే**
**సీనియర్ సిటిజన్లకు పరీక్షలో స్వల్ప మినహాయింపు**





న్యూఢిల్లీ

అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్న విదేశీయులు అక్టోబర్ 20 నుంచి అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) కొత్త విధాన ం కింద కఠినమైన నిబంధనలు ఎదుర్కోవలసి ఉంటుంది. ఇకపై దరఖాస్తుదారులు పౌర విధులకు సంబంధించిన ప్రశ్నలకు సరైన జవాబులు ఇవ్వాల్సి ఉంటుంది. వారి వ్యక్తిగత ప్రవర్తనా నిశితంగా పరిశీలిస్తారు.ఎన్–400 ఫారాన్ని దాఖలు చేసిన విదేశీయులకు 2025 నేచురలైజేషన్ (సహజీకరణ) (పౌరసత్వ) పౌర శాస్త్ర పరీక్షను అక్టోబర్ 20న లేక ఆ తర్వాత నిర్వహిస్తామని యూఎస్‌సీఐఎస్ తన వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఈ పరీక్ష మౌఖికంగా ఉంటుంది. 128 ప్రశ్నల జాబితాలో 20 ప్రశ్నలు మౌఖిక పరీక్షలో ఉంటాయి. పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలంటే దరఖాస్తుదారులు 12 ప్రశ్నలకు సరైన జవాబులు ఇవ్వాల్సి ఉంటుంది. 20 ప్రశ్నలలో 9 ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా చెబితే పరీక్షలో ఫెయిల్ అవుతారు. అభ్యర్థి 12 ప్రశ్నలకు సరైన సమాధానాలు చెబితే అధికారులు ఇక ప్రశ్నలు అడగడం ఆపేస్తారు. అలాగే 9 ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వలేకపోతే కూడా ప్రశ్నలు అడగడం ఆపేస్తారు అని యూఎస్‌సీఐఎస్ తన వెబ్‌సైట్‌లో వివరించింది. అయితే 65 ఏళ్ల పైబడి, కనీసం 20 ఏళ్లుగా స్థానికంగా నివసిస్తున్న వారికి మాత్రం ప్రత్యేక నిబంధనలు కొనసాగుతాయి. వారు 10 ప్రశ్నలలో 6 ప్రశ్నలకు సరైన జవాబిస్తే పాస్ అయిపోతారు. నేర కార్యకలాపాలకు దూరంగా ఉన్నారా లేదా అన్న విషయంతోపాటు అమెరికా సమాజానికి అందచేసిన సేవలు ఏమిటన్న అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తారు. 1991 నుంచి పక్కనపెట్టిన పొరుగువారి నుంచి ఆరా తీయడం కూడా మళ్లీ చేపట్టాలని యూఎస్‌సీఐఎస్ నిర్ణయించుకుంది. దరఖాస్తుదారుడు పనిచేస్తున్న సంస్థ యాజమాన్యం, సహ ఉద్యోగులు, ఇంటికి సమీపంలో నివసిస్తున్న వారి నుంచి కూడా అధికారులు ఆరా తీయనున్నారు. పౌరసత్వ పరీక్షలో ఉత్తీర్ణులు అయ్యేందుకు అభ్యర్థులకు రెండు అవకాశాలు ఉంటాయని, రెండవ ప్రయత్నంలో కూడా ఫెయిల్ అయితే పౌరసత్వాన్ని తిరస్కరించినట్లుగా పరిగణించాలని యూఎస్‌సీఐఎస్ తెలిపింది.

**వీసా కోసం అందరూ ఇంటర్వ్యూకు హాజరవాల్సిందే**

'వీసా ఇంటర్వ్యూ మినహాయింపు' నిబంధనల్లో చేసిన మార్పులు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రాబోతున్నాయి. దీనివల్ల ఎంతోమంది అభ్యర్థులు, 18 ఏండ్ల లోపు, 79 ఏండ్లు దాటినవారు కచ్చితంగా అమెరికా ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది

# ఇక స్వదేశీ 4జీ!

ఝార్సుగూడ



ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ సేవలు దేశ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఒడిశాలోని ఝార్సుగూడలో ఈ సేవలను ప్రారంభించారు. అలాగే రూ.37,500 కోట్ల వ్యయంతో పూర్తి స్వదేశీ సాంకేతికతతో నిర్మించిన 97,500కు పైగా 4జీ మొబైల్ టవర్లను కూడా ఆయన ప్రారంభించారు. దీంతో టెలికాం పరికరాలను సొంతంగా ఉత్పత్తి చేసే చైనా, డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియాల సరసన భారత్ చోటు దక్కించుకుంది. ఈ నెట్‌వర్క్ పూర్తిగా క్లౌడ్ ఆధారితమైనదని, భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేయవచ్చని అధికారులు తెలిపారు. ప్రధాని మోదీ కలలకు ప్రతిరూపమైన డిజిటల్ ఇండియా లక్ష్య సాధనలో ఇదొక మైలురాయిగా పేర్కొన్నారు. దీంతో 26,700కు పైగా గ్రామాల్లో 20 లక్షల మందికిపైగా కొత్త వినియోగదారులకు 4జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. అదేవిధంగా డిజిటల్ భారత్ నిధి ద్వారా 30వేల గ్రామాలను అనుసంధానించే లక్ష్యంతో 100శాతం 4జీ శాచ్యురేషన్ నెట్‌వర్క్‌తో పాటు ఒడిశాలో రూ.60వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. 8ఐఐటీల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.37,500 కోట్ల వ్యయంతో 97,500కు పైగా 4జీ మొబైల్ టవర్ల ఏర్పాటు. వీటిలో చాలవరకూ సౌర శక్తితో పనిచేసేవి కావడంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ టెలికం సైట్‌ల క్లస్టర్‌గా గుర్తింపు. 100శాతం 4జీ శాచ్యురేషన్ నెట్‌వర్క్‌తో దేశవ్యాప్తంగా దాదాపు 30వేల గ్రామాలకు 4జీ సేవలు.

క్లౌడ్ ఆధారిత నెట్‌వర్క్ కావడంతో భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేసే అవకాశం.

**సహకరించిన టెక్ దిగ్గజాలు**

స్వదేశీ 4జీ నెట్‌వర్క్ రూపకల్పనలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు టెక్ దిగ్గజాలైన టీసీఎస్, సీ–డాట్, తేజస్ నెట్‌వర్క్ లిమిటెట్ కీలక పాత్ర పోషించాయి.
టీసీఎస్ – డేటా సెంటర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ నిర్వహణ
తేజస్ నెట్‌వర్క్ – రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ (ఆర్ఏఎన్)

**ప్రజలను దోచుకున్న కాంగ్రెస్**

కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా దోచుకుందని మోదీ ఆరోపించారు. అల్పాదాయ వర్గాలను కూడా వదలకుండా వారిపైనా పన్నుల భారం మోపిందని మండిపడ్డారు. ఒడిశాలోని ఝార్సుగూడలో శనివారం నిర్వహించిన 'నమో యువ సమాబేశ్'లో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో ప్రబలంగా ఉన్న దోపిడీ సంస్కృతి నుంచి బీజేపీ రక్షించిందని అన్నారు. ప్రజలను దోచుకోవడానికి ఏ అవకాశాన్ని కూడా కాంగ్రెస్ వదిలిపెట్టలేదని విమర్శించారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా బీజేపీ ప్రభుత్వం ఆదాయాన్ని, పొదుపును రెట్టింపు చేసిందని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం రెండు సెమీ కండక్టర్ యూనిట్లను మంజూరు చేసిందని, అర్థిక కారిడార్ కోసం కూడా ప్రణాళికలు ఉన్నాయన్నారు.

# డ్రోన్ల ద్వారా ఆహార పంపిణీ



**హైదరాబాద్ :** భారీ వర్షాలతో పాటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుండి నీటిని విడుదల చేస్తుండటంతో మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. చాదర్‌ఘాట్, పురానాపూల్, ఎంజీబీఎస్, మూసారాంబాగ్ తదితర ప్రాంతాలను వరద ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో అధికా రులు డ్రోన్ల ద్వారా బాధితులకు ఆహారం, మంచినీరు అంది స్తున్నారు. హైడ్రా, రెవెన్యూ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, జీహెచ్ ఎంసీ సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

**మంజీరా నదికి పోటెత్తుతున్న వరద**

సంగారెడ్డి, మెదక్ జిల్లాలను మంజీరా నది వరద వణికిస్తోంది. సింగూరు, మంజీరా బ్యారేజీల నుంచి మంజీరా నదికి భారీ వరద వస్తోంది. మంజీరా ఉగ్రరూపానికి ఏడుపాయల వనదుర్గా ఆలయం గత కొన్ని రోజులుగా వరద నీటిలోనే ఉంటోంది. వరద ధాటికి ఆలయం వద్ద ప్రసాదాల పంపిణీ షెడ్డు కొట్టుకుపోయింది. అమ్మవారి ఆలయానికి వచ్చే దారులన్నీ మూసివేశారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. రైతులు, పశువుల కాపరులు, మత్స్యకారులు నది వైపు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

**ముందే హెచ్చరించినా పట్టించుకోలేదు**

భారీ వర్షాలతో హైదరాబాద్ నగరం జల దిగ్బంధంలో చిక్కుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది ప్రభుత్వ వైఫల్యం కాదని, నేరపూరిత నిర్లక్ష్యమని ఆయన ఘాటుగా విమర్శించారు. వాతావరణ శాఖ ముందుగానే తీవ్ర వర్షాలు కురుస్తాయని హెచ్చరించినా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం అప్రమత్తంగా వ్యవహరించ లేదని ఆయన మండిపడ్డారు. వరద తీవ్రతను అంచనా వేయడంలో, ప్రణాళికలు రచించడంలో, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం సాధించడంలో సర్కారు పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ ముందుచూపు లోపం వల్లే పండుగ వేళ ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు ఎంజీబీఎస్ బస్టాండులో వరద నీటిలో చిక్కుకుని రాత్రంతా భయంతో గడపాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో పరీవాహక ప్రాంతాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బురద రాజకీయాలను కాసేపు పక్కనపెట్టి, సహాయక చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. వరదల్లో చిక్కుకున్న ప్రయాణికులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. మూసీ పరిసర ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే ప్రజలను గుర్తించి, వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్‌లో ముప్పై ఏళ్ల మహా ప్రళయం

**ఉగ్రరూపం దాల్చిన మూసీ...**

**జలదిగ్బంధంలో ఎంజీబీఎస్, అప్రమత్తమైన యంత్రాంగం**

**హైదరాబాద్ :** మహానగరాన్ని ప్రకృతి విపత్తు కమ్మేసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, చారిత్రక మూసీ నది దాదాపు మూడు దశాబ్దాలలో ఎన్నడూ చూడని విధంగా ఉగ్రరూపం దాల్చింది. జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) గేట్లను తెరవడంతో, నగరంలోకి వరద నీరు వేగంగా ప్రవేశించింది. పురానాపూల్ బ్రిడ్జి వద్ద మూసీ నది ఏకంగా 13 అడుగుల ఎత్తులో ప్రవహిస్తుండటం ఈ పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ మహా ప్రవాహం కారణంగా నగరంలో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి, దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మూసీ వరద ఉధృతికి మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) పూర్తిగా నీట మునిగింది. దీంతో బస్ స్టాండ్ జలదిగ్బంధంలోకి వెళ్లిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి వేళ వరద నీరు ఎంజీబీఎస్ ప్రాంగణంలోకి చేరడంతో, టీజీఎస్ఆర్టీసీ అధికారులు బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌కు వెళ్లే రెండు ప్రధాన బ్రిడ్జిలు నీట మునగడం పరిస్థితి తీవ్రంగా మారింది. టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అధికారికంగా ఈ మూసివేతను ప్రకటించారు. వరద ఎంజీబీఎస్‌లోకి చేరిన తక్షణమే, డీఆర్ఎఫ్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన స్పందించారు. డీఎఫ్ఓ యజ్ఞ నారాయణ, ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, సిబ్బంది తాళ్ల సాయంతో ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన ఎంజీబీఎస్ చరిత్రలో అరుదైనదిగా నిలిచింది. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, ఎంజీబీఎస్ నుంచి బయలుదేరే బస్సులను నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి సంస్థ మళ్లించారు. ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ వైపు వెళ్లే సర్వీసులు జేబీఎస్ నుంచి నడుస్తున్నాయి. వరంగల్, హన్మకొండ వైపు వెళ్లేవి ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి, సూర్యాపేట, నల్గొండ, విజయవాడ వైపు వెళ్లేవి ఎల్బీనగర్ నుంచి, మహబూబ్‌నగర్, కర్నూల్, బెంగళూరు వైపు వెళ్లేవి ఆరాంఘర్ నుంచి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయి. ప్రయాణికులు ఎంజీబీఎస్‌కు రావొద్దని టీజీఎస్ఆర్టీసీ విజ్ఞప్తి చేసింది.

**ప్రాణాల కాపాడిన రెస్క్యూ బృందాలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్ విభాగాల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న 1000 మందికి పైగా ప్రజలను అధికారులు తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించారు. పురానాపూల్ శివాలయంలో వరద నీటిలో చిక్కుకుపోయిన నలుగురు ఆలయ సిబ్బందిని కాపాడేందుకు హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. నీటి ప్రవాహం పెరగడంతో ఆపరేషన్‌కు అంతరాయం ఏర్పడింది. శివాలయం పైనే



పూజారి కుటుంబం ఉండిపోగా, వారికి టిఫిన్స్ భోజనాలు అందించారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) సర్వీస్ రోడ్డుపై కూడా వరద బీభత్సం కనిపించింది. ఉస్మాన్ సాగర్ గేట్లు ఎత్తడంతో నార్సింగి మంచిరేవుల మధ్య సర్వీసు రోడ్డుపై వరద పారింది. బారికేడ్లు పెట్టినా పట్టించుకోకుండా ఆటో ట్రాలీలో రోడ్డు దాటేందుకు ప్రయత్నించిన డ్రైవర్, అందులోని నలుగురిని హైడ్రా ఆఖీఈ బృందాలు రాత్రివేళ సురక్షితంగా కాపాడాయి.

చాదర్‌ఘాట్ వంతెన వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చిన్న బ్రిడ్జి మూసివేయడంతో, పెద్ద బ్రిడ్జి పైనుంచి వాహనాలు రాకపోకలు కొనసాగించాయి. అంబర్‌పేట్ ? దిల్‌సుఖ్‌నగర్ రహదారి పూర్తిగా మూసివేశారు.

**పునరావాస కేంద్రాల్లో బాధితులు**

వరద ప్రభావిత ప్రాంతాల్లోని కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాస కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హైదరాబాద్ ప్రజలకు ఇబ్బందులు కలగకుం డా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ముంపుకు గురైన కు టుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వెల్లడించారు.

**పునరావాస కేంద్రాల వివరాలు:**

శంకర్ నగర్ ప్రాంతంలోని దాదాపు 500 మంది నిర్వాసితులు షాజాదీ మసీదులో వసతి పొందుతున్నారు.

మలక్‌పేట్ సర్కిల్‌లోని మూసానగర్ కమ్యూనిటీ హాల్ లో 150 మంది వసతి పొందుతున్నారు. దుర్గా నగర్, అంబేద్కర్ నగర్ నిర్వాసితులు (దాదాపు 45 కుటుంబాలు) మూసారాం బాగ్ వంతెనకు సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసతి పొందుతున్నారు. కృష్ణ నగర్ కమ్యూనిటీ హాల్‌కు 32 మందిని తరలించి ఆహారపదార్థాలు అందిస్తున్నారు. భూలక్ష్మి ఆలయం నుంచి 55 మందిని గోడే-కి-ఖబర్ కమ్యూనిటీ హాల్‌కు తరలించారు. ఈ కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బతుకమ్మ, దసరా పండుగలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. మంజీరా నది మహోగ్రరూపం దాల్చింది. ఏడు పాయల ఆలయం వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది, వరద ఆలయం పైకప్పును తాకుతోంది. దీంతో ఆలయం వద్దకు ఎవరూ రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు. వరద ఉధృతికి ప్రసాదాల పంపిణీ షెడ్డు కొట్టుకుపోయింది. మంజీరా బ్యారేజీకి భారీగా వరద నీరు చేరడంతో 1.20 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 46.60 అడుగులకు చేరింది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. నీటిమట్టం 48 అడుగులకు చేరితే రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

యాదాద్రి జిల్లాలో కూడా మూసీ ఆగ్రహం కనిపించింది. జూలూరు ? రుద్రవెల్లి వద్ద వంతెనపైగానే వరద ప్రవహించడంతో పోచంపల్లి ? బీబీనగర్ రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రాణ నష్టం జరగకుండా అధికారులు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. మూసీ ఒడ్డునకు, వంతెనలకు దగ్గరగా వెళ్లవద్దని అధికారులు ప్రజలను విజ్ఞప్తి చేశారు. అయితే, కొంతమంది ప్రజలు పురానాపూల్, నయాపూల్ బ్రిడ్జిల నుంచి వరద నీటిని చూసి ఆశ్చర్యానికి లోనవడం, సెల్ ఫోన్లలో వీడియోలు తీసుకోవడం, సెల్ఫీలు దిగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. అటువంటి ప్రమాదకర చర్యల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు, పురానాపూల్ బ్రిడ్జి పైన చిరు వ్యాపారులను కూడా పోలీసులు అనుమతించడం లేదు. వాతావరణ శాఖ రాబోయే 24 గంటల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. దీనికి తోడు, మూసీ కాలుష్యం, ముఖ్యంగా అతిక్రమణల వల్ల నది నీటి పారుదల సామర్థ్యం తగ్గిందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ వరదలపై స్పందిస్తూ, వరద బాధితులకు అండగా నిలవాలని తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**మునిగిపోయిన ఇమ్లిబన్**

హైదరాబాద్ మహానగరాన్ని శుక్రవారం రాత్రి భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. కుండపోత వానకు నగరం అస్తవ్యస్తంగా మారింది. జంట జలాశయాల గేట్లు ఎత్తడంతో మూసీనది ఉగ్రరూపం దాల్చి, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) ప్రాంగణాన్ని పూర్తిగా ముంచెత్తింది. వందలాది మంది ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, పిల్లలు గంటల తరబడి బస్టాండ్‌లోనే చిక్కుకుపోయి తీవ్ర భయాందోళనలకు, ఇబ్బందులకు గురయ్యారు. మూసీ ప్రవాహం అర్ధరాత్రి తర్వాత ఒక్కసారిగా పెరిగి, గండిపేట నుంచి నాగోల్ వరకు నది ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. అర్ధరాత్రి సమయంలోనే ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించి, బస్టాండ్‌లో చిక్కుకున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావాలని పోలీసు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**-నివాళులర్పించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు**

**మంథని :** స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి దశ నుండి మాలి దశ వరకు ముందుండి పోరాడిన నాయకుడు,మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకలను శనివారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంథని మాజీ ఏమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు మంథని పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్వతంత్ర సమరయోధునిగా తెలంగాణ ఉద్యమకారునిగా, మంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంథని బిఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ఏగోలపు శంకర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు తగరం శంకర్ లాల్, ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మణ్, సింగిల్ విండో డైరెక్టర్లు మాచిడి రాజు గౌడ్, ఆకుల రాజబాబు,గోబ్బురి వంశీ, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు కనవేని శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు జంజర్ల శేఖర్. పుప్పాల తిరుపతి, ఎస్కేయాకుబ్, ఇర్ఫాన్,పిల్లి సత్య నారాయణ,బండారి శ్రీకాంత్, పీక మల్లేష్, బోనాల నరేందర్, జనగమ సంతోష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## మార్కండేయ నగర్ లో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు

**ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను యువత కొనసాగించాలి**



**గండిపేట్ : సూర్య ప్రతినిధి** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్‌లో ఏర్పాటుచేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఏర సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కాశిగారి యాదగిరి హాజరయ్యారు. అనంతరం బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్వ సత్యనారాయణ కాశిగారి యాదగిరి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సమాజ సేవ, విద్యా వ్యాప్తి, సాంఘిక సంస్కరణల కోసం చేసిన కృషిని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలను ఈ తరం యువత కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోట జగదీష్, గద్దె కృష్ణ, గద్దె యాదగిరి, మార్కండేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వీడెం రమేష్, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్, మామిడిశెట్టి శ్రీనివాస్, గంజి ధనంజయ్, శిరం దాస్ ప్రభాకర్, ఉడుత సురేష్, కర్నాటి శ్రీనివాస్, ఏర్వ మహేష్, యాదగిరి భాస్కర్, గోపాల్, రాంచందర్, పిస్కె భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు......

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

**తెలంగాణ పద్మశాలి సంఘం**

**ఉపాధ్యక్షులు ఏర్వ సత్యనారాయణ**



**గండిపేట్, సూర్య ప్రతినిధి** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఏర్వ సత్యనారాయణ అన్నారు. ఆయన నేటి యువతకు స్ఫూర్తిదాయకుడని కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని మైలార్ దేవ్ పల్లి డివిజన్ భవన ఋషి కాలనీ శ్రీ మార్కండేయ ట్రస్ట్ భవనంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఏర్వ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “తెలంగాణ సమాజానికి బాపూజీ చేసిన సేవలు మరువలేనివన్నారు. తొలి, మలిదశ తెలంగాణ పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. తన జీవితమంతా అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పరితపించిన గొప్ప నాయకుడు బాపూజీ” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాశీగారి యాదగిరి, కొంపల్లి జగదీష్, బాస శ్రీనివాస్, సామల యాదయ్య, కోట శ్యామ్ కుమార్, సిద్దిరాల రాజ్ కుమార్, బిర్రు రాఘవేంద్ర, బండ యాదగిరి, వీడేం రమేష్, గోంత్యాల శ్రీనివాస్, దస పతి బిక్షపతి, దస పతి రాజు, ఒగ్గు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే ఇందిరమ్మ ఇళ్లు సాకారం

**నల్గొండ :** తేలకంటిగూడెం లో ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహ ప్రవేశం కార్యక్రమంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మీరు ఇవాళ నాకు అపూర్వ స్వాగతం పలికారు. ధన్యవాదాలు. ఇందిరమ్మ ఇండ్లు ముందు మీ ఊరిలోనే ఇవ్వాలని పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న. స్థలంతో కలిపి ఒక్కో ఇంటికి 15లక్షల పై చిలుకు ఖర్చు చేశాం. నిజమైన పేదవారికి ఇళ్ల పట్టాలు ఇస్తుంటే..గృహ ప్రవేశాల్లో పాల్గొంటే నాకు ఎంతో సంతోషంగా ఉన్నదని అన్నారు. మీరు ఎంతో ఆప్యాయత చూపిస్తారు. మీ కండ్లలో నీళ్లు వస్తే..నా కండ్లలో నీళ్లు తిరుగుతాయి. మీకు ఏ కష్టం వచ్చినా నేను ఉంటా. మిమ్మల్ని కడుపులో పెట్టుకొని కాపాడుకునే బాధ్యత నాది. పేదలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండాలే. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కాబట్టే ఇవాళ ఇందిరమ్మ ఇండ్ల కల సాకారం అయింది. ప్రతి ఎకరానికి సాగునీరు అందించే ఏర్పాటు చేస్తున్నాం. మీరు అడిగినవి,అడగనవి అన్ని చేసుకుంటూ పోతున్న. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ,జడ్పీటీసీ,సర్పంచ్ లకు ఓటు వేసి ఆశీర్వదించాలిని కోరుతున్న. ఎవరికి ఏ ఆపద వచ్చిన నేను ఉంటా...ఆపదలో ఉన్న వారు ఏ పార్టీ అని ఏనాడు నేను చూడలేదు. కుల,మతాలకు,రాజకీయాలకు అతీతంగా సాయం చేస్తున్నామని అన్నారు.

## డీఎస్పీ పంచరు షాపు నడుపుకునే వ్యక్తి కూతురు?

**వరంగల్ :** ములుగు జిల్లా జేడీ మల్లంపల్లి గ్రామానికి చెందిన మౌనిక జీవితం చిన్నప్పటి నుంచి కష్టాలతోనే సాగింది. కూలీ పనులు చేసే తల్లి సరోజ, చిన్న పంక్చర్ షాపుతో కుటుంబాన్ని నెట్టుకొచ్చిన తండ్రి సమ్మయ్య.. ఇద్దరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించేవారు. ఆర్థిక పరిస్థితి ఎంత కఠినంగా ఉన్నా.. వారు కూతురు చదువును మాత్రం ఆపలేదు. వారి త్యాగాలు, కలలని చూసి మౌనిక ప్రభుత్వ కొలువు సంపాదించి.. తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలం ఇవ్వాలని చిన్నప్పుడే నిర్ణయించుకుంది. 2020లో డిగ్రీ పూర్తి చేసిన ఆమె.. ఆ తర్వాత పూర్తిగా ఉద్యోగ సాధనపై ఫోకస్ పెట్టింది. కోచింగ్ సెంటర్లకు భారీ ఫీజులు కట్టే పరిస్థితి లేకపోవడంతో.. ఇంట్లోనే తన ప్రిపరేషన్ కొనసాగించింది. గ్రూప్-1 పరీక్షల కోసం రోజుకు 12 గంటలకుపైగా క్రమశిక్షణతో చదివింది. క్రమం తప్పకుండా టెస్ట్ పేపర్లు రాసి.. తన తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకు సాగింది. కష్టాలు ఎన్ని వచ్చినా, లక్ష్యాన్ని వదల్లేదు. ఆ పట్టుదల ఫలించింది. తాజాగా విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో మౌనిక 315వ ర్యాంక్ సాధించింది. ఈ ర్యాంక్ ద్వారా ఆమె డీఎస్పీగా ఎంపికైంది. తల్లిదండ్రులు ఒకప్పుడు చెమటోడ్చి నడిపిన పంక్చర్ షాపు ముందు, ఈరోజు డీఎస్పీగా నిలబడ్డ కూతురి విజయాన్ని చూసి వారి కళ్లలో ఆనందభాష్పాలు మెరిశాయి. మౌనిక గెలుపు కేవలం వ్యక్తిగత విజయమే కాదు.. అనేక పేద, మధ్యతరగతి యువతకు స్ఫూర్తి. శ్రమను ఆయుధంగా మార్చుకుంటే విజయమే నీ సొంతం అవుతుంది అని తన జీవితం ద్వారా నిరూపించింది మౌనిక. గ్రామమంతా ఆమెను అభినందిస్తారు. అం దరూ గొప్ప కూతుర్ని కన్నారు అంటుంటే మౌనిక తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

**సిద్దిపేట :** కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా కలెక్టర్ కె.హైమావతి కలిసి పాల్గొని పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ సమాజానికి చేసిన సేవలు మరవరానివని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పెద్దమనిషిగా ముందుండి ఉద్యమానికి, ఉద్యమకారులకు ఎంతో తోడ్పాటు అందించారని అన్నారు. నిబద్ధత కలిగిన రాజకీయవేత్త అని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ చిరస్మరణీయులుగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. జిల్లా కలెక్టర్



## జై హనుమాన్ కోసం నిరీక్షణ తప్పదు

రేపు జనవరి నెలతో హనుమాన్ వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోతాయి. హీరో తేజ సజ్జ నుంచి మిరాయ్ వచ్చింది కానీ దర్శకుడు ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో మరో సినిమా ఇప్పటిదాకా మొదలుకాలేదు. నందమూరి మోక్షజ్ఞ డెబ్యూ మూవీ అన్నీ ఓకే అనుకున్నాక ఆగిపోవడం ఊహించని ట్విస్టు. ఒకవేళ అనుకున్నట్టే సవ్యంగా జరిగి ఉంటే ఇప్పటికో పాతిక శాతం పూర్తయ్యేది. రణ్వీర్ సింగ్ తో బాలీవుడ్ సినిమా సైతం ఫోటో షూట్ తర్వాత క్యాన్సిల్ కావడం ఇంకో పరిణామం. ఇన్ని హెచ్చుతగ్గుల మధ్యలోనూ ప్రశాంత్ వర్మ తన నిర్మాణ పర్యవేక్షణలో మహా కాళీ, అధీర అనే రెండు సూపర్ హీరో మూవీస్ తీస్తున్నాడు. ఇక ప్రశాంత్ వర్మ భుజాల మీద ఉన్న అతి పెద్ద బాధ్యత జై హనుమాన్. ప్రకటించి నెలలు గడిచిపోతున్నప్పటికీ ఇంకా సెట్స్ పైకి వెళ్ళకపోవడంతో ఫ్యాన్స్ అనుమానపడిన సందర్భాలు లేకపోలేదు. కాంతార చాప్టర్ 1 ప్రమోషన్లలో హీరో రిషబ్ శెట్టి దానికి క్లారిటీ ఇచ్చాడు. కాంతార మీద పూర్తి దృష్టి పెట్టడం వల్ల పారలల్ గా జై హనుమాన్ చేసే అవకాశం లేకపోయిందని, స్క్రిప్ట్ చెప్పినప్పుడు తాను స్పెల్ బౌండ్ అయ్యానని, ఎప్పుడెప్పుడు మొదలుపెట్టాలని ఎదురు చూస్తున్నానని అన్నాడు. అంటే ఇంకో నెల రెండు నెలల్లో స్టార్ట్ కావొచ్చు. అయితే జై హనుమాన్ కోసం కాస్త ఎక్కువ నిరీక్షణ తప్పేలా లేదు. ఎందుకంటే అక్టోబర్ లేదా నవంబర్ లో జై హనుమాన్ చిత్రీకరణ మొదలైనా పూర్తయ్యేనాటికి కనీసం ఏడాది పడుతుంది. ఆపై పోస్ట్ ప్రొడక్షన్లు, విఎఫ్ఎక్స్ లు, మార్కెటింగ్, ప్రమోషన్లు వగైరాలు ఎక్కువ సమయం డిమాండ్ చేస్తాయి. అంటే 2027 సంక్రాంతికి కూడా డౌటే. పైగా రిషబ్ శెట్టి కేవలం జై హనుమాన్ కు మాత్రమే కమిట్ మెంట్ ఇవ్వలేదు.



## అమీషా పటేల్ సంచలన స్టేట్‌మెంట్!


ఒకప్పటి స్టార్ హీరోయిన్ అమీషా పటేల్50 ఏళ్లు వచ్చినప్పటికీ బ్యాచ్‌లర్ లైఫ్ లీడ్ చేస్తోంది. పెళ్లి చేసుకోకుండా వరుస చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ పలు ఇంటర్వ్యూలో పాల్గొంటూ వార్తల్లో నిలుస్తోంది. ఈక్రమంలో.. గత కొద్ది కాలంగా ఈ అమ్మడు పెళ్లి చేసుకోబోతుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అమీషా పటేల్ ఓ హీరోపై షాకింగ్ కామెంట్స్ చేసింది. "హాలీవుడ్ సూపర్ స్టార్ టామ్ క్రూజ్ అంటే నాకు పిచ్చి. ఎవరైనా అతనితో పాడ్‌కాస్ట్ చేయగలిగితే.. దయచేసి నన్ను కూడా పిలవండి. నా చిన్నప్పటి నుంచి నాకు టామ్ క్రూజ్ అంటే చాలా ఇష్టం. నా ఫైల్స్‌లో కూడా అతని ఫొటో ఉండేది. నా గదిలో ఉన్న ఏకైక పోస్టర్ అతనిదే. టామ్ క్రూజ్ ఎప్పటికీ నా ఫస్ట్ క్రష్. నేను అతని కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ఏకంగా అతనితో ఒక రాత్రి గడపడానికి కూడా వెనకాడను. ఒకవేళ నాకు అవకాశం వస్తే పెళ్లి కూడా చేసుకుంటాను. అతనికి అంత పెద్ద అభిమానిని నేను ఎందుకో కారణం తెలియదు. కానీ ఆయన అంటే పడిచచ్చిపోతాను" అని అందరికీ షాకిచ్చింది. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి. ఈ అమ్మడు అంత ఒపెన్ కావడంతో అంతా షాక్ అవుతూ పలు రకాలుగా స్పందిస్తున్నారు.

## బికిని ఫొటోలపై సాయి పల్లవి క్లారిటీ




పద్ధతైన పాత్రలు, అద్భుతమైన డ్యాన్సులు, క్లాసీ లుక్ వీటి గురించి మాట్లాడుకోగానే మొదట గుర్తుకు వచ్చేది హీరోయిన్ సాయి పల్లవి. సాంప్రదాయ లుక్‌లో కనిపిస్తూ కోట్లాది మంది ఫ్యాన్స్‌ను తన సొంతం చేసుకున్న ఈ బ్యూటీకి సంబంధించి లేటెస్ట్‌గా బికిని ఫొటోలు వైరల్ అయ్యాయి. తన సోదరితో విదేశాలకు వెకేషన్‌కు వెళ్ళిన ఈ మలయాళ ముద్దుగుమ్మ.. బికినీ ధరించినట్లు కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ హాట్ టాపిక్‌గా మారాయి. ఇక ఈ ఫోటో చూసిన ఆమె అభిమానులు.. తలలు పట్టుకుంటున్నారు. ఇవి నిజమైన ఫొటోలు కాకపోవచ్చు, ఎఐ ద్వారా క్రియేట్ చేసినవి కావచ్చు అంటూ భిన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. తాజాగా వీటిపై ఇన్‌డైరెక్ట్‌గా క్లారిటీ ఇస్తూ సాయి పల్లవి ఓ పోస్ట్ పెట్టింది. ట్రిప్‌కు సంబంధించిన పూర్తి వీడియోను షేర్ చేస్తూ.. 'పైన కనిపిస్తున్నవన్నీ నిజంగా తీసిన ఫొటోలు.. ఏఐ ఫొటోలు కాదు' అనే క్యాప్షన్ ఇచ్చింది. దీంతో.. ఆమె షేర్ చేసిన వీడియోలో బికిని ఫొటోలు లేకపోవడంతో.. బికిని ఫొటోలు ఏఐవి.. ఇప్పుడు తను షేర్ చేసినవి నిజమైనవి అంటూ క్లారిటీ ఇచ్చింది. దీంతో ఆమె బికిని ధరించలేదు అని క్లారిటీ రావడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు.

## 'కొత్తలోక' సీక్వెల్.. వీడియోతో ప్రకటన



మలయాళంలో తెరకెక్కిన 'కొత్తలోక: చాప్టర్1' కాసుల వర్షం కురిపించింది. అయితే, ఈ సినిమాకు సీక్వెల్‌ను తాజాగా మేకర్స్ ప్రకటించారు. ఈ క్రమంలోనే ఒక వీడియోను పంచుకున్నారు. రూ. 30 కోట్లతో చిన్న సినిమాగా విడుదలైన కొత్తలోక ఏకంగా రూ. 267 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటేసి రికార్డ్ క్రియేట్ చేసింది. అత్యధిక వసూళ్లు రాబట్టిన మలయాళ చిత్రంగా నిలిచింది. దేశంలోనే మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమాగా రికార్డ్ క్రియేట్ చేసింది. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ సినిమాను దర్శకుడు డామినిక్ అరుణ్ తెరకెక్కించారు. ఇందులో కల్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో నటించారు. కొత్తలోక చాప్టర్1లో టొవినో థామస్, దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రల్లో మెరిశారు. అయితే, సీక్వెల్‌లో వీరి పాత్ర కీలకం కానున్నట్లు తెలుస్తోంది. తాజాగా విడుదలైన పార్ట్2 వీడియోలో వారిద్దర మధ్య జరిగిన సంభాషణను చూపించారు. సీక్వెల్‌ను కూడా డామినిక్ అరుణ్ తెరకెక్కించనున్నట్లు ప్రకటించారు. తాజాగా విడుదలైన ప్రత్యేక ప్రోమో అభిమానులను మెప్పిస్తుంది. షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. విడుదల తేదీ, నటీనటుల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.






## ప్రేమ మాయాజాలాన్ని అనుభూతి చెందండి

బాలీవుడ్ యంగ్ బ్యూటీ సోనమ్ బజ్వా బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో తీరక లేకుండా గడుపుతోంది. ప్రస్తుతం ఈ అమ్మడు నటిస్తున్న సినిమాల్లో 'నిక్కాజలిదార్-4' ఒకటి. ఈ సినిమా 'నిక్కాజలిదార్-3'కు సీక్వెల్‌గా రాబోతుంది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి సిమెర్జిత్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. రెజ్లింగ్ పై ఆసక్తి లేని ఓ పంజాబీ వ్యక్తి, ఉత్సాహభరితమైన హర్యాన్వీ స్త్రీని కలిస్తాడు. పరిచయం కాస్త ప్రేమగా మారిన తర్వాత తన ప్రపంచం మారిపోయినట్లుగా గ్రహిస్తాడు. వారు ప్రేమలో పడిన తర్వాత ఏం జరిగింది ఎలాంటి.. ప్రమాదాలు ఎదుర్కొన్నారనేది ఈ మూవీ కథ. దీనిని గున్బీర్ సింగ్ సిద్ధూ, మన్మోర్డ్ సిద్ధూ, అమ్రీత్ షేర్ సింగ్, రాంనీత్ షేర్ సింగ్ నిర్మిస్తున్నారు. ఇందులో సోనమ్ అమ్మీ విర్క్, నిర్మల రిషి, నిషా బానో, సోనియా కౌర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన సోనమ్ వరుస అప్డేట్స్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈక్రమంలో.. తాజాగా, సోనమ్ బజ్వా 'నిక్కాజలిదార్-4'చిత్రానికి సంబంధించిన ఓ ప్రేమ పాట రాబోతున్నట్లు ప్రకటించింది. "సెప్టెంబర్ 28న విడుదలవుతున్న మా సినిమా పాటతో ప్రేమ మాయాజాలాన్ని అనుభూతి చెందండి. మీ హృదయాన్ని వెచ్చదనంతో నింపే మనోహరమైన ఈ సాంగ్‌ను మీ ప్లే లిస్ట్‌లో చేర్చుకోండి" అనే క్యాప్షన్ జత చేసింది.

## దేవర వార్షికోత్సవం.. ఫ్యాన్స్ కోసం స్పెషల్ షో

జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన దేవర చిత్రం నేటికి ఏడాది పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రబృందానికి వార్షికోత్సవం శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు చిత్రబృందం కూడా దేవర వన్ ఇయర్ పూర్తి చేసుకున్న సందర్భంగా దేవర 2 త్వరలోనే సెట్స్ మీదకి వెళ్లబోతున్నట్లు ప్రకటించింది. అయితే ఈ సినిమా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా అభిమానుల కోసం చిత్రబృందం స్పెషల్ షోని ఏర్పాటు చేసింది. కూకట్‌పల్లిలోని అర్జున్ థియేటర్‌లో రాత్రి 9 గంటలకు దేవర సినిమాను ప్రదర్శించబోతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు కొరటాల శివ దర్శకత్వం వహించగా.. జాన్వీ కపూర్ కథానాయికగా నటించింది. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటించాడు. ఈ చిత్రం సెప్టెంబర్ 27న విడుదలై దాదాపు రూ.500 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.